VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 25-05-2023 సంపుటి : 04 సంచిక : 234 పేజీలు : 8 వెల : రూ 3-00

## ప్రపంచం ముందు మరో ముప్పు

**కరోనాను మించిన ఉపద్రవం రాబోతోంది**
**ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక**

జెనీవా,మే24(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా రాబోయే కాలంలో మరో మహమ్మారి ప్రమాదం పొంచి ఉందని, రాబోయేకాలంలో తదుపరి మహమ్మారిని ప్రపంచ దేశాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని డబ్ల్యుహెచ్ఓ హెచ్చరించింది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో డబ్ల్యుహెచ్ఓ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లో డబ్ల్యుహెచ్ఓ హెడ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ మాట్లాడుతూ.. 'కోవిడ్ -19 మహమ్మారి ముగింపుతో.. ప్రపంచ ముప్పు ముగిసిపోలేదు. కోవిడ్‌లాంటిదే మరో వేరియంట్ రూపాంతరం చెందే అవకాశముంది. ఈ కొత్త వేరియంట్ వల్ల.. కొత్త వ్యాధులు పుట్టుకొస్తాయి. అత్యధిక మరణాలు కూడా సంభవించే అవకాశముంది. మరో వ్యాధికారక ముప్పు మిగిలే ఉంది. కోవిడ్ - 19 మహమ్మారికంటే 'ప్రాణాంతకమైన' మరో మహమ్మారి కోసం ప్రపంచం సిద్ధంగా ఉండాలి' అని ఆయన హెచ్చరించారు.



ఈ సందర్భంగా తదుపరి మహమ్మారిని ఎదుర్కొనేందుకు, అత్యవసర పరిస్థితులను పరిష్కరించే ప్రభావవంతమైన ప్రపంచ యంత్రాగాల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. 'తదుపరి మహమ్మారిరి పుట్టుకొస్తే.. ఆ మహమ్మారి పరిస్థితులను ఎదుర్కొనేందుకు మనమంతా నిర్ణయాత్మకంగా, సమిష్టిగా, సమానంగా సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలి' అని ఆయన సలహా ఇచ్చారు. అలాగే సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డిజి) కింద ఆరోగ్య సంబంధిత లక్ష్యాలకు కోవిడ్ - 19 గణనీయమైన ప్రభావాలను కలిగి ఉందని టెడ్రెస్ చెప్పారు. 2017 డబ్ల్యుహెచ్ఓ అసెంబ్లీ సమావేశాల్లో ట్రిపుల్ బిలియన్ లక్ష్యంగా పెట్టుకుంది. అంటే.. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ మందికి సార్వత్రిక ఆరోగ్య కవరేజ్ ఉందని భరోసా కల్పించడం, మరో బిలియన్ కంటే ఎక్కువ మందికి ఆరోగ్య అత్యవసర పరిస్థితుల నుండి రక్షించడం, మరో బిలియన్ కంటే ఎక్కువమందికి మెరుగైన ఆరోగ్యం కల్పించడం వంటి ట్రిపుల్ బ్రిలియన్ లక్ష్యంగా పెట్టుకుంటే.. ఈ లక్ష్యాల పురోగతిపై కూడా కరోనా ప్రభావితం చేసిందని టెడ్రెస్ అన్నారు.

# విద్యతోనే ఉన్నతస్థానం సాధ్యం



**ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నదే లక్ష్యం**
**సామాజికంగా ఎదగాలన్న సంకల్పంతో ఉన్నాం**
**జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.703 కోట్ల బదిలీ**
**కొవ్వూరులో కాతాలకు బదిలీ చేసిన సిఎం జగన్**





కాకినాడ,మే24): జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లాలంటే విద్యతోనే సాధ్యమని సిఎం జగన్ అన్నారు. తరాల తలరాతలు మారాలంటే విద్య ఒక్కటే మార్గమని చెప్పారు. నాలుగేళ్ల పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, నిరుపేదలు సామాజికంగా ఎదగాలని ఆశించారు. జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో పాల్గనేందుకు తూర్పో గోదావరి జిల్లా కొవ్వూరుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ బుధవారం ఉదయం చేరుకున్నారు. మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన, విశ్వరూప్‌లు సిఎం జగన్‌కు స్వాగతం పలికారు. జనవరి-మార్చి 2023 త్రైమాసికానికి 9.95 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.703 కోట్లను సిఎం జగన్ బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ ... విద్యా దీవెన ద్వారా ఇప్పటివరకూ రూ. 10, 636 కోట్లు ఖర్చు చేశామని సిఎం తెలిపారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 703 కోట్లు జమ చేస్తున్నామన్నారు. విద్యా దీవెనతో 9.95 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. వివక్ష పోవాలన్నా పేదరికం పోవాలన్నా చదవన్నదే గొప్ప అస్త్రం అని వర్ణించారు. పిల్లలు చదువుకుంటే భావితరాలు బాగుపడతాయని కోరారు. పిల్లల చదువులపై చేస్తున్న ఖర్చు హ్యూమన్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ అని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి దశదిశ చూపిస్తుందని సిఎం జగన్ తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు మారుస్తున్నామన్నారు. ప్రతిభ చూపించే ప్రతి విద్యార్థికి తోడుగా ఉంటామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి ఒక సత్య నాదెళ్ల రావాలి అని సిఎం కోరారు. గత పాలన దోచుకో, పంచుకో తినుకో అన్నట్టుగా ఉండేదని విమర్శించారు. గత పాలకులు గజదొంగల ముఠాగా ఏర్పడ్డారని అన్నారు. పేదవాడికి పెత్తందారులకు మధ్య క్లాస్ వార్ జరుగుతోందని, ఒక్క జగన్‌ను ఎదుర్కొనేందుకు తోడేళ్లంతా ఏకమవుతున్నాయని సిఎం జగన్ వ్యాఖ్యానించారు. వివక్ష పోవాలన్నా పేదరికం పోవాలన్నా చదవన్నదే గొప్ప అస్త్రమని తెలిపారు.

పిల్లల్లో చదువును ప్రోత్సహించేందుకే విద్యా దీవెన తీసుకొచ్చామన్నారు. ఈ పథకంతో 9.95 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 703 కోట్లు జమ చేస్తున్నామన్నారు. విద్యా దీవెన ద్వారా నాలుగేళ్లలో రూ. 10, 636 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, నిరుపేదలు సామాజికంగా ఎదగాలనే నాలుగేళ్ల పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు సీఎం జగన్. తరాల తలరాతలు మారాలంటే విద్య ఒక్కటే మార్గమని తెలిపారు. జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లాలంటే విద్యతోనే సాధ్యమని పేర్కొన్నారు.

# పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించరాదు




**నవభారతానికి...ప్రాచీన సంప్రదాయం జోడింపు**
**విపక్షాల ప్రకటనపై హోంమంత్రి అమిత్ షా**
**కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నటుల విపక్షాల ప్రకటన**



న్యూఢిల్లీ,మే24(: భారత దేశ నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడం నవ భారతాన్ని, ప్రాచీన సంప్రదాయాలతో అనుసంధానం చేయడమని కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా అభివర్ణించారు. దీనిని రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు హితవు పలికారు. దీని గురించి ప్రజలను ఆలోచించనిద్దామని, వారికి నచ్చిన విధంగా స్పందించనిద్దామని చెప్పారు. నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 28న ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకాబోమని 19 ప్రతిపక్ష పార్టీలు సంయుక్తంగా ప్రకటించాయి. రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి కాకుండా ప్రధానమంత్రి మోదీ పార్లమెంటు భవనాన్ని ప్రారంభించటం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే నని, పార్లమెంటుకు ఆత్మ వంటి ప్రజాస్వామ్యానికే చోటు లేనప్పుడు కొత్త భవనానికి ఇక ఎలాంటి విలువ లేదని ఆరోపించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు దేశం పార్టీ, వైకాపా ఈ కార్యక్రమానికి హాజరు కాబోతున్నట్లు తెలిపాయి. అదేవిధంగా పంజాబ్‌లోని శిరోమణి అకాలీదళ్, ఒడిశా అధికార పార్టీ బీజేడీ కూడా హాజరుకాబోతున్నట్లు ప్రకటించాయి. తెలంగాణ అధికార పార్టీ బీఆర్ఎస్ గురువారం ఓ నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి కేంద్రం లోని అధికార కూటమి ఎన్డీయే పక్షాలు హాజరవుతాయి. ఈ నేపథ్యంలో అమిత్ షా బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, భారత దేశ నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడం నవ భారతాన్ని, ప్రాచీన సంప్రదాయాలతో అనుసంధానం చేయడమని తెలిపారు. దీనిని రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు హితవు పలికారు. దీని గురించి ప్రజలను ఆలోచించనిద్దామని, వారికి నచ్చిన విధంగా స్పందించనిద్దామని చెప్పారు. ఇదిలావుండగా, కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి గతంలో జరిగిన ఇటువంటి కార్యక్రమాలను గుర్తు చేశారు. 1975 ఆగస్టులో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పార్లమెంటు అనెక్స్‌ను ప్రారంభించారని, 1987లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీపార్లమెంటు గ్రంథాలయాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు.

## భూమా అఖిలప్రియకు ఊరట

**బెయిల్ మంజూరు చేసిన కోర్టు**



కర్నూలు,మే24: టీడీపీ నేత, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కస్టడీ కోసం పోలీసులు వేసిన పిటిషన్ ను కర్నూలు కోర్టు తోసిపుచ్చింది. ఇటీవల టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డిపై దాడి కేసులో అఖిల ప్రియను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆమె కర్నూలు మహిళా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. భూమా అఖిల ప్రియకు 7 నెలల బాలుడు ఉన్నాడు. అందుచేత బెయిల్ ఇవ్వాలని ఆమె తరపు న్యాయవాదులు నంద్యాల కోర్టు (ఔజీనిటాజ్జీ÷జీ అనీబీసబి)లో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో మళ్లీ కర్నూలు కోర్టులో న్యాయవాదులు పిటిషన్ వేశారు. దీనిపై న్యాయస్థానం విచారణ జరిపి ఆమెకు బెయిల్ మంజూరు చేసింది. మరోవైపు పోలీసులు కూడా భూమా అఖిల ప్రియను కస్టడీ తీసుకునేందుకు పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. దీంతో మరి కాసేపట్లో అఖిల ప్రియ కర్నూలు మహిళా సబ్ జైల్ నుంచి విడుదల కానున్నారు. ఈ నేపథ్యంలో నంద్యాల నుంచి అఖిల ప్రియ కార్యకర్తలు, అభిమానులు కర్నూలుకు బయలుదేరారు. కాగా ఈ నెల 16న రాత్రి నంద్యాల మండలం, కొత్తపల్లి దగ్గర యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డి .. అఖిల ప్రియ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే అఖిల ప్రియ అనుచరులు ఏవీ సుబ్బారెడ్డిపై దాడిచేశారు. ఈ ఘటనలో సుబ్బారెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. ఈ క్రమంలో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అఖిలప్రియపై నంద్యాల పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## స్వదేశీ ఉత్పత్తులతోనే యువతకు ఉపాధి

**కాశ్మీర్ స్వయం సమృద్ధి దిశగా కృషి**
**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**




శ్రీనగర్,మే24 : స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విదేశీ ఉత్పత్తులను తగ్గించి స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని వ్యాపారవేత్తల కు సూచించారు. కాశ్మీర్ కూడా అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, అనేక రకాలైన నూతన ఉత్పత్తులు దేశంలోనే తయారు కావడం అభినందనీయని అన్నారు. వందేళ్ల మన్నిక కలిగిన ఉత్పత్తులను దేశీయంగా తయారు చేస్తున్నారని తెలిపారు. పర్యాటకంగా కాశ్మీర్ మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. జి-20 సదస్సు లో పాల్గొంటున్న ఆయన తనను కలసిన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 370 రద్దుతో కాశ్మీర్ దేశంతో మమేకం అయ్యిందన్నారు. ఇది మోడీ, షాల దార్శనికత అన్నారు. ఇకపోతే పర్యావరణ పరిరక్షణలో భాగమవడం భారతీయ జీవన విధానమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలకు ఓ మంచి వాతావరణం, ప్రశాంత జీవనం అందించేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తోందని కిషన్ రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే ప్రధాని మోడీ 'మిషన్ లైఫ్'ను ఆచరణలోకి తీసుకొచ్చారన్నారు. గిరిజనులు అడవుల్లో ప్రకృతితో సహజీవనం చేస్తూ.. అదే ప్రకృతిని తమ దైవంగా భావించడవే 'మిషన్ లైఫ్' ప్రోగ్రాంకు స్ఫూర్తి అని వివరించారు.

## తారెత్తిస్తున్న ఎండలు

**వేడి గాలులతో జనం ఉక్కిరిబిక్కిరి**

అమరావతి,మే24: రాష్ట్రంలో భానుడు భగ్గుమంటున్నాడు. తారెత్తిస్తున్న ఎండలతో వేడిగాలులతో వేడెక్కిపోతున్న రాష్ట్రంలో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. నేడు, రేపు కూడా ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని, వేడిగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పడమర దిశ నుంచి వీచిన గాలులతో రాయలసీమ, కోస్తాల్లోని అనేక ప్రాంతాల్లో ఉక్కపోత, వేడి వాతావరణం నెలకొంది. పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. నంద్యాల జిల్లా చాగలమర్రిలో మంగళవారం 44.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఎండలు క్రమేపీ పెరుగుతాయని, ఈ నెల 25న ఎక్కువ ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం గుంటూరు జిల్లా, విజయనగరం జిల్లాల్లో 41-44 డిగ్రీల ఉష్ణోగ్రతలతో వేడిగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం రాష్ట్రవ్యాప్తంగా 124 మండలాల్లో వేడిగాలులు వీస్తాయని చెప్పింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



## అమరావతిలో టెన్షన్ వాతావరణం

**ర్యాలీని అడ్డుకున్న పోలీసులు**
**జడ శ్రావణ్ అరెస్ట్**

విజయవాడ,మే24 : అమరావతిలో టెన్షన్ వాతావరణం కొనసాగుతోంది. తుళ్లూరు లో 48 గంటల దీక్షకు జడ శ్రావణ్ కుమార్ పిలుపు ఇచ్చారు. అయితే దీక్షకు వచ్చిన శ్రావణ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రావణ్ నివాసం, కార్యాలయాన్ని పోలీసులు చుట్టుముట్టారు. అక్కడకు ఎవరినీ అనుమతించడం లేదు. రోడ్డుపైకి వచ్చినవాళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు.

# సంపాదకీయం

గురువారం 25-05-2023

## ముగింపు దశలో రష్యా, యుక్రెయిన్ వార్

రష్యా, యుక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం చూపించే స్థితిలో భారత్ ఉందా..? ప్రధాని మోదీ ఈ బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చగలరని ప్రపంచమంతా ఎందుకనుకుంటోంది...? పుతిన్, జెలన్‌స్కీని యుద్ధవిరమణ కోసం ఒప్పించేందుకు మోదీ చేయబోయే ప్రయత్నాలేంటి..? అణుబాంబుబాధిత ప్రాంతం హీరోషిమా నుంచి ప్రధాని ఇచ్చిన శాంతిసందేశం...యుక్రేనియన్లను చీకటి నుంచి వెలుగువైపు నడిపిస్తుందా..? 15 నెలలుగా గ్యాప్ లేకుండా కొనసాగుతున్న రష్యా, యుక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం చూపించే స్థితిలో భారత్ ఉందా..? యుద్ధాన్ని ముగించేందుకు భారత్ చేయబోయే ప్రయత్నాలేమిటి?? ప్రధాని మోదీ ఈ బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చగలరని ప్రపంచమంతా ఎందుకనుకుంటోంది?? పుతిన్, జెలన్‌స్కీని యుద్ధవిరమణ కోసం ఒప్పించేందుకు మోదీ చేయబోయే ప్రయత్నాలేంటి..? అణుబాంబుబాధిత ప్రాంతం హీరోషిమా నుంచి ప్రధాని ఇచ్చిన శాంతిసందేశం.. యుక్రేనియన్లను చీకటి నుంచి వెలుగువైపు నడిపిస్తుందా..?యుద్ధం వల్ల కలిగే వినాశనం గురించి.. యుక్రెయిన్ లో ప్రతీ గల్లీ చెబుతుంది. ప్రతీ శిథిలం కథలుకథలుగా చెబుతాయి. రష్యా క్షిపణుల దాడులకు కునారిల్లిపోయిన ప్రతి గోడా? యుక్రేనియన్ల దీనగాథలకు ప్రత్యక్ష సాక్షులుగా నిలుస్తున్నాయి. ఈ యుద్ధం ముగుస్తుందా? ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని మాతదేశాన్ని వీడి వెళ్లిపోయినవారు తిరిగి వస్తారా? యుక్రెయిన్ లో మళ్లీ సన్ ఫ్లవర్ పూలు విరిబూస్తాయా? అనే సందేహాల మధ్య నెలలుగా కొనసాగుతోంది. యుద్ధం యుక్రేనియన్ల జీవితంలో ఓ భాగమైంది. యుద్ధం ఈ క్షణం ముగిసినా యుక్రెయిన్ పునర్‌నిర్మాణానికి దశాబ్దాల కాలం పడుతుంది. అక్కడ జరిగిన..ఇంకా జరుగుతున్న పెను విధ్వంసం అంచనాలకు అందనిది. ఇంతటి భారీ నష్టం తర్వాత కూడా యుక్రెయిన్ అటు రష్యా,ఇటు యుక్రెయిన్ వెనక్కి తగ్గడం లేదు. పాశ్చాత్య దేశాల నుంచి అందుతున్న ఆయుధాల సాయంతో జెలన్‌స్కీ నేతృత్వంలో పోరాడుతూనే ఉంది. రష్యా ఆక్రమించిన భూభాగాలన్నింటినీ తిరిగి స్వాధీనంచేసుకోవడమే తమ లక్ష్యమని జెలన్‌స్కీ చెబుతున్నారు. మరోవైపు రష్యా మాత్రం తన లక్ష్యమేంటో ప్రకటించలేదు కానీ..దాడులు ఆపడం లేదు. దీంతో యుద్ధం రోజురోజుకూ భీకరంగా మారుతోందే తప్ప తీవ్రత తగ్గడం లేదు.యుద్ధం తర్వాత రష్యా ప్రపంచంలో ఒంటరయింది. ఆ దేశం నుంచి యూరప్ దేశాలు చమురుకొనడం మానేశాయి. దీంతో చవక ధరకు భారత్, చైనాకు రష్యా చమురు అమ్ముతోంది. మిగిలన దేశాలు ఏ ఆరోపణలు చేస్తున్నా..యుద్ధం చేయడానికి రష్యా కారణాలు రష్యాకున్నాయి. అంతమాత్రాన యుద్ధాన్ని ఎవరూ సమర్థించరు. ఆ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నది అన్ని దేశాలూ చెప్పేమాట. చర్చలతోనే సమస్యకు పరిష్కారం కనుగొనాలని అందరూ కోరుకుంటున్నారు. భారత్ కూడా అదే చెబుతోంది. యుద్ధం ద్వారా కాకుండా చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. యుక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్, చైనా తటస్థ వైఖరి అవలంబించాయి. భారత్? రష్యాకు అనుకూలంగా కానీ, వ్యతిరేకంగా కానీ ఓటేయలేదు. భారత్, రష్యా మధ్య ఉన్న మిత్రత్వాన్ని దృష్టిలో పెట్టుకుని..యుద్ధానికి పరిష్కారం కనుగొనేదేశం భారతే అని మిగిలిన ప్రపంచమంతా భావిస్తోంది. జెలన్‌స్కీ కూడా గతంలో ప్రధాని మోదీతో మాటల్లో ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు. మోదీ చెబితే..పుతిన్ వింటారన్నది ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్న విషయం.యుద్ధం తర్వాత పుతిన్‌తో ప్రధాని సమావేశమయ్యారు. వీలయినంత త్వరగా యుద్ధం పరిష్కారం కనుగొనాలని సూచించారు. ఇప్పుడు జెలన్‌స్కీతో సమావేశంలో యుద్ధ పరిష్కారంలో భాగమవుతామని హామీ ఇవ్వడం ఇందులో భాగమే. సమయం, సందర్భం అన్నీ కుదిరినప్పుడు.. మోదీ శాంతిచర్చలకు మధ్యవర్తిత్వం వహించే అవకాశముంది. యుద్ధానికి దారితీసిన పరిష్కారం కాని సమస్యలపై రెండు దేశాలు చర్చించుకుని ఓ నిర్ణయానికి వస్తే?మరుక్షణం యుద్ధం ఆగిపోతుంది. యుక్రెయిన్ నాటోలో చేరకుండా ఉండడంతో పాటు.. యుక్రెయిన్ భూభాగాన్ని రష్యా వ్యతిరేకశక్తులు ఉపయోగించుకునేందుకు అనుమతించనివ్వకూడదన్నది రష్యా చేస్తున్న ప్రధాన డిమాండ్. యుక్రెయిన్ ప్రభుత్వం..నాటోలో చేరబోమన్న హామీ ఇవ్వడం లేదు. రష్యా గతంలో ఆక్రమించుకున్న క్రిమియాతో పాటు? ఈ యుద్ధంలో ఆక్రమించుకున్న నాలుగు తూర్పు ప్రాంతాలు తిరిగి ఇచ్చేయాలన్నది జెలన్‌స్కీ డిమాండ్. అసలు యుక్రెయిన్ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేదాకా యుద్ధాన్ని ఆపబోమని కూడా జెలన్‌స్కీ అంటున్నారు. ఎవరి వాదనల్లో న్యాయముంది..అన్యాయముంది అన్న సంగతిని పక్కనపెడితే..అసలు రెండు దేశాల నేతలు ఓ చోట కూర్చుని మాట్లాడుకుంటే..ఓ పరిష్కారం దొరుకుతుంది. అలా కూర్చునే విధంగా చేయడానికే ప్రపంచదేశాలు చొరవచూపాలి. ఇప్పుడు మోదీ అదే చేయాలన్నది అన్ని దేశాల ఆలోచన. రష్యా మిత్రదేశంగా..భారత్ చర్చలకు మార్గాన్ని సుగమం చేయాలని అన్ని దేశాలూ కోరుకుంటున్నాయి.రష్యా, యుక్రెయిన్ మధ్య చర్చలు జరిగేలా చూడడానికి మిగిలిన దేశాల నేతలతో కలిసి ప్రధాని మోదీ ప్రయత్నించే అవకాశముంది. యుద్ధంతో సర్వనాశనమైన హీరోషిమా వేదికగా ప్రధాని వినిపించిన శాంతిసందేశం అమలు జరగాలని ఆ ప్రతిఫలాన్ని యుక్రెయిన్ ఊపిరి పీల్చుకోవాలని భావిస్తోంది. హీరోషిమాలో మోదీ జెలన్‌స్కీ సమావేశం,శాంతియుత పరిష్కారంతో యుద్ధం ముగిసే అవకాశముందన్న అభిప్రాయం కలిగిస్తోంది. మోదీతో సమావేశం తర్వాత చర్చలపై జెలన్‌స్కీకి ఓ నమ్మకం కలిగింది. అందుకే మానవతాదృక్పథంతో సాయం చేయడానికి సిద్ధమైన భారత్‌కు జెలన్‌స్కీ కృతజ్ఞత తెలిపారు. అందరి ఆకాంక్షలూ ఫలించి భారత మధ్యవర్తిత్వంతో యుద్ధం ముగిస్తే?ఆ రెండు దేశాలే కాక మిగిలిన ప్రపంచమంతా కూడా సంతోషిస్తుంది.కాగా..ఇక ఈ యుద్ధానికి ముగింపు కలుగే ఆశలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ప్రధాని మోదీ ఈ ఏడాది చివర్లో భారత్ జీ-20 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సదస్సుకు ముందే ప్రధాని మోదీ రష్యా,యుక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మాస్కో వెళ్లే అవకాశమున్నట్లుగా సమాచారం. రష్యా అధ్యక్షుడు పుతిన్ తో మోదీ భేటీ అయి ఈ విషయం గురించి చర్చిస్తారని సమాచారం. ఈ చర్చలు ఫలిస్తే పుతిన్ అంగీకరిస్తే ఇక ఈ యుద్ధానికి ముగింపు వచ్చినట్లే..అదే జరగాలని ప్రపంచమంతా భావిస్తోంది.

# మరింత పటిష్టంగా దిశచట్టం

### కఠినంగా శిక్షలు వేయాలన్న భావన
### సత్ఫలితాలు ఇస్తున్న పోలీస్ చర్యలు

అమరావతి,మే24,ఎపి సర్కార్ ఓ సంచలన నిర్ణయం తీసుకుని దిశ చట్టాన్ని తీసుకుని వచ్చినా లైంగిక వేధింపులు, ప్రేమదాడులు ఆగడం లేదు. మృగాళ్లు విజృంభిస్తూనే ఉన్నారు. అత్యాచార ఘటనలు సాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నా రోజూ ఎక్కో ఒకచోట ఘటనలు తారసపడుతున్నాయి. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. దిశ లాంటి ఓ పటిష్ట చట్టం తీసుకుని రావడం నిజంగా అభినందనీయం అనుకున్న వారు కూడా ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ ఎపి సిర్కార్ దిశ చట్టాన్ని తీసుకుని వచ్చింది. మహిళలు, బాలికలపై అత్యాచారాలు వంటి అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా దిశ చట్టాన్ని రూపొందించారు. దీనిని నిర్ధారించే ఆధారాలున్నప్పుడు 21 రోజుల్లోనే తీర్పు ఇచ్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మహిళలపై అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకొచ్చింది. ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21 వర్కింగ్ డేస్ ల్లో తీర్పు వచ్చేలా క్రిమినల్ లా చట్టంలో మార్పులు చేసారు. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. దిశలో భాగంగా మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం జరిగింది. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు ప్రకటించారు. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది. ఎపి ప్రభుత్వం కఠిన చట్టంతో మహిళలకు భరోసా ఇస్తోంది. అయితే చట్టాలు ఉన్నా ప్రజల్లో మార్పులు మాత్రం రావడం లేదు. దుండగులను కఠినంగా అణచివేస్తే తప్ప మహిళలకు రక్షణ ఉండదని తేలిపోయింది. కఠినంగా అణచివేత చర్యలకు ఉపక్రమించాలన్ని సర్వత్రా విజ్ఞప్తులు వస్తున్నాయి.

# సీజనల్ వ్యాధుల నివారణకు ముందే మేల్కోవాలి

### పారిశుద్ధ్య నిర్వహణా లోపం రాకుండా చూడాలి
### ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్యం సాధ్యం

విశాఖపట్టణం,మే24 : వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంఓనే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతాయి. ఏటా ఇలాంటి సమ్యలు చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. వర్షాకాల వ్యాధులపై చైతన్యం చేయాల్సి ఉంది. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. కరోనా కారణంగా ఇప్పుడా భయం తగ్గింది. అయితే కరోనా వల్ల ఓ మంచి మాత్రం జరిగింది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలకు అలవాటు పడుతున్నారు. ఇది కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. అయితే కరోనా పరిస్తితి కారణంగా ఇప్పుడు ప్రజలకు గుణపాఠం వచ్చిందనే చెప్పాలి. అయితే ఇది ఎంతకాలం అన్నది కూడా చూడాలి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతు న్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవు తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీ లు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు.

# టివి నటి వైభవి దుర్మరణం

### హిమాచల్ టూర్‌లో కారు లోయలో పడి దుర్మరణం



సిమ్లా,మే24: హిమాచాల్ అందాలను సరదాగా చూసొద్దామని భావించి, కాబోయే భర్తతో వెళ్లిన ప్రముఖ హిందీ సీరియల్ 'సారాభాయ్ వెర్సన్ సారాభాయ్' తో మంచి పేరు తెచ్చుకున్న హిందీ నటి వైభవి ఉపాధ్యాయ కారు ప్రమాదంలో చనిపోయారు. ఈ సీరియల్‌లో ఆమె హిందీ ప్రేక్షకులకు ఎంతో చేరువ అయ్యారు. సాంఘీక మాధ్యమాల్లో ఆమె మరణవార్త విని ప్రతి ఒక్కరూ స్పందిస్తూ, ఆమె మరణం తీరనిలోటని, ఇంత చిన్న వయస్సులోనే ఆమె హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని అంటున్నారు. వైభవి ఉపాధ్యాయ తనకి కాబోయే భర్తతో కారులో వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. మంగళవారం హిమాచల్ ప్రదేశ్‌లో ఈ ఘటన జరిగిందని అని తెలుస్తోంది. వైభవి తనకి టైము దొరికితే విహార యాత్రకు వెళ్లడం ఇష్టమని, ఈసారి హిమాచల్ ప్రదేశ్ లో అందమైన ప్రదేశాలను చూడటానికి వెళ్లారని తెలిసింది. కాబోయే భర్త జై సురేష్ గాంధీతో కలిసి కారులో బయలుదేరారు. హిమాచల్ ప్రదేశ్ లోని కులు జిల్లాలోని బంజర్ పట్టణంలో ఉన్న తీర్థన్ లోయ సందర్శనకు వెళ్ళినప్పుడు ఈ ప్రమాదం సంభవించినట్టుగా తెలుస్తోంది. అక్కడికి సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ఘాట్ రోడ్డులోని రోడ్డు నుండి సుమారు 50 అడుగుల లోతైన లోయలో పడిపోయింది అని అంటున్నారు.వెంటనే స్థానికులు ఆ ఘటన ప్రదేశానికి చేరుకున్నా అప్పటికే వైభవి ప్రాణాలు కోల్పోయిందని తెలుస్తోంది. ఆ తరువాత స్థానికులు పోలీసులకు కూడా సమాచారం ఇచ్చారు, వాళ్ళు కూడా అక్కడికి చేరుకున్నా వైభవిని కాపాడలేకపోయారు, ఆమె కాబోయే భర్త జై సురేష్‌ను మాత్రం బయటికి తీయగలిగారు. అతనికి కూడా తీవ్ర గాయాలు వెంటనే దగ్గరలో వున్నా బంజర్‌లోని హాస్పిటల్‌కు తరలించారు. స్థానిక పోలీసులు ఆమె సోదరుడుకి ఈ సమాచారం అందించారు, అతను వచ్చిన తరువాత వైభవి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అతనికి అప్పగించారు. వైభవి 'సారాభాయ్ వెర్సస్ సారాభాయ్' సీరియల్ లోనే కాకుండా, సిఐడి,అదాలత్ సీరియల్స్ లో కూడా నటించింది.

## ఆర్. కొత్తూరు గ్రామంలో పట్టాభి రామస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు.

### హోరా హోరీగా ఎద్దులకు బండలాగుడు పోటీలు.





విభారె న్యూస్,రుద్రవరం మండలంలోని ఆర్. కొత్తూరు గ్రామంలో పట్టాభి రామస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం యంత్రాభిషేకం, ఆవాహిత దేవతా హోమములు, మండపారాధనలు, రుద్ర హోమములు, సుదర్శన హోమములు, ఆదిత్యాది నవగ్రహ అష్టదిక్ మన్యసుక్తై హోమాలు, దాన్యాది పుష్పాలు వాసాలు మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన ప్రజలకు నిర్వాహకులు భోజన వసతులు కల్పించారు.హోరాహోరీగా ఎద్దులకు బండలాగుడు పోటీలు.పట్టాభి రామస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు సందర్భంగా బుధవారంఎద్దులకు హోరాహోరీగాబండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నంద్యాల ,కడప, కర్నూలు ,జిల్లాలకు చెందిన 19జతల వృషభ రాజములు పోటీలలో పాల్గొన్నాయి. ఈపోటీల్లో గెలుపొందిన వృషభ రాజములకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. పోటీలను తిలకించడానికి చుట్టుపక్క గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సచివాలయల్లో అకస్మిక తనిఖీలు





నంద్యాల మా ప్రతినిధి మే 24 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో బుధవారం నాడు . మునిసిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి , అసిస్టంట్ కమిషనర్ వెంకట దాస్. , మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి స్పందన మరియు పలు అంశాలపై ఎమ్ ఎస్ నగర్. బొమ్మలసత్రం. , సాదిక్ నగర్ సాయిబాబా నగర్ హరిజనవాడ 2 సచివాలయంలను ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది కి తగు సూచనలు చేశారు. .

## భగవద్గీత కర్తవ్య బోధన !(ఆధ్యాత్మికం)

తిరుమల,మే24(ఆర్ఎన్ఎ): భగవద్గీత పారాయణం ప్తరి ఒక్కరికీ నిత్యకృత్యం కావాలి. భగవద్గీత శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి కర్తవ్య నిర్వహన ఎట్లా చేయాలో తెలియక తపన చెందే హృదయానికి ఉపశమనంగా అనుగ్రహించినటువంటి మహోపదేశం. అర్జునుడికే కాదు, కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకి సందిగ్దతకి సమాధానంగా భగవద్గీత ఈ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది, ఏ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది. ఏ పని ఎట్లా చేయాలి, ఎంత వరకు చేయాలి అనే సంశయం కలిగిన వ్యక్తికి ఒక శ్రేయ సాధనంగా భగవద్గీత ఉపయోగపడుతుంది. నాకు కర్తవ్యం ఏమిటో తెలియట్లేదు కానీ, 'ఏ శ్రేయస్యం నిశ్చితం భూహితన్మే' నేను శ్రేయస్సుని కోరుకుంటున్నాను, నాకేది శ్రేయస్సో అది చెప్పు అని అర్జునుడు అడిగినది. శ్రేయస్సుని పొందాలి అనుకున్నవాడికే ఏమైనా చెప్పడం అవసరం, ఆ శ్రేయస్సు కోరే వ్యక్తి ఏ స్తాయిలో ఉన్నా అందరికి అందేలా శ్రీకృష్ణ భగవానుడు అందించిన ఉపదేశమే భగవద్గీత. అది వ్యక్తి గతంగా చిన్న స్థాయిలో కావచ్చు, యువ స్థాయిలో కావచ్చు, ఒక గృహస్తుగా జీవించే వ్యక్తి స్థాయిలో కావచ్చు, లేక వ్యాపారమో, వాణిజ్యమో, ఔద్యోగికమో ఏదో రకమైన శ్రేయస్సుని పొందాలి, అది అత్మోజ్జీవ నకరమై ఉండాలి అనే వ్యక్తికి భగవంతుడు చేసిన అతి శక్తి వంతమైన ఉపదేశమే శ్రీమద్భగవద్గీత.మనకూ సంశయాలు తీరుతాయి, చేయాల్సిన కర్తవ్యం గుర్తితాం. చేసే తెలివి కలుగుతుంది. జీవితాన్ని సుఖమయం చేసుకుంటాం. ఉపద్రవాలు వస్తానే ఉంటాయి, అవి ఉపశమించాలి, అపన్నులైన వ్యక్తులను ఆదుకొనే హృదయ సౌకుమార్యం ఏర్పడాలి. మనం చెదరకుండా ఉండేందుకు మనో ధైర్యం ఏర్పడాలి. ఇవన్నీ కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం.

# నాని మాటలకు అర్థాలే... వేరులే



విజయవాడ, మే 24,విజయవాడ ఎంపీ కేశినేని నాని మాటల వెనుక ఆంతర్యం ఏమిటో తెలియక టీడీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీలో ఉంటూ వైసీపీ నేతల్ని పొగడటం, పార్టీ నేతల్ని ఇరుకున పెట్టేలా కామెంట్లు చేయడం ఆయనకే చెల్లిందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. వరుసగా రెండుసార్లు విజయవాడ ఎంపీగా గెలిచిన కేశినేని నానికి ముచ్చటగా మూడో సారి టీడీపీ టిక్కెట్ దక్కుతుందో లేదోననే అనుమానం అందరిలోను ఉంది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో కేశినేని నానికి ప్రత్యేకంగా ఓ వర్గమంటూ మిగలకుండా పోయింది. నాని తీరుతో విభేదించే వాళ్లు, వ్యతిరేకించే వాళ్లంతా ఏకమై నానిని ఓడించాలని శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో విజయవాడ ఎంపీ టిక్కెట్ కోసం సొంత తమ్ముడి నుంచి కూడా నాని పోటీ ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వైసీపీ నాయకుల్ని పొగుడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావుతో పాటు ఆయన సోదరుడు ఎమ్మెల్సీ అరుణ్ కుమార్‌లపై టీడీపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. ఎమ్మెల్యే సోదరుల్ని వసూల్ బ్రదర్స్ అంటూ ప్రచారం చేస్తోంది. ఈ క్రమంలో కేశినేని నాని మొండితోక సోదరుల్ని పొగడ్తలతో ముంచెత్తడం చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వకపోతే కేశినేని భవన్‌లో కూర్చొని బెజవాడ ప్రజలకు సేవ చేస్తానన్నారు. రాజకీయాల్లో తాను, తన కుటుంబం జీవితాంతం ఉండాలని భావించే వ్యక్తిని కాదని, మంచి పనులు ఎవరు చేస్తే వాళ్ళని అభినందిస్తానని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ నాలుగేళ్లుగా తనకు తెలుసని, మొండితోక సోదరులు మంచి చేస్తున్నారు కాబట్టి ప్రశంసించానని చెప్పారు. తనకు తెలిసి మొండి తోక బ్రదర్స్ మంచి వాళ్ళని పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇసుకలో వాటాలు, మైనింగ్‌లో వాటాలు ఇవ్వకపోతే ధర్నా బ్లాక్ మెయిలింగ్ వంటి రాజకీయాలు తాను చేయనన్నారు. నందిగామ సిట్టింగ్ ఎమ్మెల్యేను ఆయన సోదరుడిని ఎంపీ నాని పొగడటం వెనుక మాజీ మంత్రి దేవినేని ఉమాను టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. నందిగామలో దేవినేని ఉమా శిష్యురాలు తంగిరాల సౌమ్య గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఉమా వర్గాన్ని ఇష్టపడటం ఇష్టం లేక వైసీపీ ఎమ్మెల్యేను ఎంపీ నాని పొగిడినట్లు కనిపిస్తోంది. బెజవాడ పార్లమెంట్‌కు ఎవరు మంచి చేస్తే వాళ్ళతో కలుస్తానని, "తెలంగాణ కోసం గొంగళి పురుగును ముద్దాడుతానని కేసీఆర్ అన్నారని, నేను బెజవాడ పార్లమెంట్ అభివృద్ధి కోసం ముళ్ళ పందితో అయినా కలుస్తానని చెప్పారు. ఎంపీగా పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చేయాలంటే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే లు సహకరించాలని వైసీపీలో ఉన్నా ఎమ్మెల్యేలు ఉదయ భాను , మొండి తోక సమన్వయం చేసుకోవటం వల్ల ఎంపీ ల్యాడ్ నిధులు ఇచ్చి పనులు చేస్తున్నానని తెలిపారు. కేశనేని నానికి 2014ఎన్నికల్లో చివరి నిమిషంలో టీడీపీ టిక్కెట్ లభించింది. అప్పట్లో సుజనా చౌదరి వంటి వారు ఆయనకు సహకరించడంతో పాటు, నాని ఒత్తిళ్లు కూడా ఫలించాయనే ప్రచారం ఉంది. 2019లో అనివార్యంగా ఆయనకు టిక్కెట్ కేటాయించాల్సి వచ్చింది. ఈసారి మాత్రం బెజవాడ ఎంపీ స్థానానికి టీడీపీలో గట్టిపోటీ నెలకొంది. పార్టీ అధిష్టానం కూడా నాని వ్యవహార శైలితో విసిగిపోయి ఉండటంతో పెద్దగా ఖాతరు చేయడం లేదు. రాష్ట్రమంతటా టీడీపీ ఓటమి పాలైనా వ్యక్తిగత ఇమేజ్ వల్ల రెండోసారి గెలిచానని కేశినేని భావిస్తున్నారని సన్నిహితులు చెబుతుంటారు. ఈ క్రమంలోనే పార్టీ పెద్దల్ని సైతం ఖాతరు చేయకుండా బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారని అనుమానిస్తున్నారు. మరోవైపు ఎంపీ కేశనేని నాని తన గెలుపుకు కారణమయ్యారని నందిగామ వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు కేశినేని నాని ఎవరో తనకు తెలియదని, నియోజక వర్గం అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. కేశినేని నాని మాత్రం టీడీపీని ఇరుకున పెట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నట్లు కనిపిస్తోంది. టీడీపీ అధిష్టానం కేశనేని చిన్నికి ప్రోత్సాహం ఇవ్వడం గిట్టకే నాని ఇలా చేస్తున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న చోట ఎంపీ నిధుల్ని కేటాయించి సొంత పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.

## వివేక హత్యపై విమలారెడ్డి సంచలన వ్యాఖ్యలు

కర్నూలు మాజీ మంత్రి వైఎస్ కూతురు సునిత వెనుక దుష్టశక్తులు వున్నాయని సునిత మేనత్త విమలా రెడ్డి అన్నారు. మృతుడు వివేకాకు ఆమె స్వయానా సోదరి. బుధవారం విమలారెడ్డి కర్నూలు అసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపి అవినాష్ రెడ్డి తల్లి శ్రీలక్ష్మిని పరామర్శించారు. విమలా రెడ్డి మాట్లాడుతూ అవినాష్ రెడ్డికి ఏ పాపం తెలియదు అమాయకుడు. తప్పుచేయని వారిని జైల్లో పెట్టారని అన్నారు. వివేకాను చంపిన వారు బయట తిరుగుతున్నారు.. అవినాష్ రెడ్డిని టార్గెట్ చేసి వేధిస్తున్నారు. తన కుటుంబం ఎవరినీ హత్య చేయలేదని సునీత మొదట చెప్పారు. ఆ తర్వాత సునీత మాట మార్చారు, తప్పు అని చెప్పినందుకే సునీత మాతో మాట్లాడటం లేదు. ఆలస్యమైనా న్యాయం జరుగుతుంది,అవినాష్ కు ధైర్యం చెప్పడానికే నేను వచ్చానని విమలారెడ్డి వెల్లడించారు.

## నెల్లూరు జిల్లా కు రూ.34.36 కోట్ల విద్యా దీవెన నిధులు

నెల్లూరు జగనన్న విద్యా దీవెన రెండో త్రైమాసిక నిధులు జమ కార్యక్రమాన్ని తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్, జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు. నెల్లూరు జిల్లాలో మొత్తం 37485 మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన రెండో విడత నిధులు సుమారు రూ. 34.36 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాలకు నేరుగా ముఖ్యమంత్రి జమ చేసారు.

## అవినాశ్ వేలి ముద్రలు' అంటూ బీటెక్ రవి షాకింగ్ వ్యాఖ్యలు

అమరావతి మే 24 టీడీపీ నేత బీటెక్ రవి నోరు విప్పితే చాలు.. ఇలా కూడా ఉంటుందా? అన్న విస్మయానికి గురి చేసేలా ఆయన తీరు ఉంటుంది. ఆయన చెప్పే మాటల్లో నిజం ఎంత? అన్నది పక్కన పెడితే.. ఆయన మాటలు మాత్రం హాట్ టాపిక్స్ గా మారుతూ ఉంటాయి. గడిచిన కొద్ది రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ అలజడిగా మారిన వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి ఎపిసోడ్ వేళ.. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సీన్లోకి వచ్చారు. తనకు అలవాటైన రీతిలో షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. ఎంపీ అవినాశ్ రెడ్డి అక్రమ సంపాదన రూ. 2వేల నోట్లతో భద్రపరిచ్చినట్లుగా తనకు సమాచారం ఉందన్నారు. అవినాశ్ వేలిముద్రలతో లాకర్లలోని రూ. 2వేల నోట్లు తెరిచి బ్యాంకుల్లో మార్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అవినాశ్ ను అరెస్టు చేస్తే.. ఆ డబ్బు మార్చుకోలేమన్న భయంతోనే సీఎం నాటకాలు ఆడిస్తున్నారన్నారు."ఈ నెల 25 వరకు అరెస్టు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ రోజున కొత్తగా బాధ్యతలు స్వీకరించే సీబీఐ డైరెక్టర్ తమకు అనుకూలంగా వ్యవహరిస్తారని పులివెందులలోని వైసీపీ నేతలు చెప్పుకుంటున్నారు. గతంలో సీబీఐ విచారణలో అవినాశ్ తాడేపల్లికి సంబంధించిన పేర్లు బయటపెట్టారు. ఇప్పుడు ఆయన్ను అరెస్టు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయి. అందుకే ముఖ్యమంత్రి భయపడుతున్నారు' అంటూ బీటెక్ రవి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. మరి.. ఈ వ్యాఖ్యలకు వైసీపీ నేతలు ఏ రీతిలో రియాక్టు అవుతారో చూడాలి.

# భీమవరం... ఎవరకి వరం

ఏలూరు, మే 24, పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంగా, నర్సాపురం లోక్‌సభ పరిధిలో కీలకమైన అసెంబ్లీ సెగ్మెంట్‌గా పేరున్న సీటు భీమవరం. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పోటీ చేయడంతో ఒక్కసారిగా అందరి పొలిటికల్ అటెన్షన్ భీమవరం వైపు మళ్ళింది. అప్పుడు గెలుపు ఓటముల సంగతి వేరే స్టోరీ. తిరిగి మరోసారి ఎన్నికలు సమీపిస్తున్న టైంలో? ఇక్కడ పొలిటికల్ హీట్ పెరిగిపోతోంది. టీడీపీ, జనసేన మధ్య పొత్తు లాంఛనమేనన్న వాతావరణం ఏర్పడటంతో ఇప్పుడు ఈ సీటు మీద పీటముడి బిగుసుకుంటోంది. పవన్‌కళ్యాణ్ మళ్ళీ భీమవరం నుంచే పోటీ చేస్తారా? లేదా ? అన్న విషయంలో క్లారిటీ లేదు. ఆయన అయితే? ఓకే.. కాని పక్షంలో ఇక్కడ పొత్తుల గొడవ పీక్స్‌కు చేరి రచ్చ రంబోలా అయ్యేలా ఉంది. పవన్ పోటీ చేయకుంటే ఈ సీటు మాకు కావాలంటే? మాకే కావాలంటూ స్థానిక టీడీపీ, జనసేన నేతలు జుట్లు పట్టుకునేందుకైనా సిద్ధమేనని అంటున్నారట. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి ఖచ్చితంగా గెలుస్తారని భావించింది లోకల్ కేడర్. కాపు ఓటు బ్యాంకు ఎక్కువగా ఉండటం, చివరి నిమిషంలో టిడిపి నాయకులు జనసేనకు సహకరించడం లాంటి ప్రయత్నాలు జరిగినా జనసేనాని గట్టెక్కలేకపోయారు. దాంతో ఈసారి ఎలాగైనా ఇక్కడ పిడికిలి బిగించాలన్న కసితో ఉన్నారు జనసైనికులు. అందుకే?వచ్చే ఎన్నికల్లో మరోసారి పవనే పోటీచేయాలని కోరుతున్నారు. కానీ.. ఈవిషయంలో అట్నుంచి స్పష్టత లేదు. ఒకవేళ ఆయన గనుక ఇక్కడ పోటీ చేయకుంటే?ఈ సీటు ఎవరికి వస్తుందన్నదే ఇప్పుడు హాట్ టాపిక్. పొత్తులపై జనసేన ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. అటు పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి తిరిగి పోటీ చేస్తే తమవైపు నుంచి పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చెప్పేశారు. కానీ? పవన్ పోటీ చేయకుంటే మాత్రం తానే బరిలో ఉంటానని కూడా కుండబద్దలు కొట్టేశారాయన. 2009లో కాంగ్రెస్ నుంచి, 2014లో టిడిపి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రామాంజనేయులుకు నియోజకవర్గంలో పట్టు ఉంది. టీడీపీ నుంచి ఆయన పోటీచేస్తే విజయం తేలికవుతుందన్న ధీమా క్యాడర్‌లో కూడా ఉంది. ఇదే సమయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు భీమవరం టికెట్ ను ఆశిస్తున్నారు. పవన్ పోటీ చేయకున్నా సరే?

ఈ సీటు జనసేనకే కావాలని? బరిలో దిగేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెబుతున్నారాయన. ఈసారి భీమవరంలో జనసేన జెండా ఎగరేసి పోగొట్టుకున్న చోటే వెదుక్కుంటామంటున్నారు. దీంతో టీడీపీ, జనసేన స్థానిక నేతల మధ్య కోల్డ్‌వార్ మొదలైపోయింది. రెండు పార్టీల నుంచి టిక్కెట్స్ ఆశిస్తున్న అభ్యర్థులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ఈసారి భీమవరం సీటు మనమే తీసుకుందాం అంటూ?తమ పార్టీల పెద్దల మీద వత్తిడి తీసుకువచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు. పవన్ పోటీ చేస్తే ఏ గొడవా లేదు. ఆయన కాదంటే మాత్రం స్థానికంగా పొత్తు బంధం తేడా కొట్టడం ఖాయమన్నది లోకల్ టాక్. ఎందుకంటే? ఇటు జనసేనకు ఇస్తే?.టీడీపీ సహకారంపై అనుమానాలున్నాయి. అటు టీడీపీకి ఇచ్చినా?జనసేన ఓట్లు ఎంతవరకు ట్రాన్స్‌ఫర్ అవుతాయోనన్న డౌట్స్ గట్టిగానే ఉన్నాయి. ఈ గొడవలో? పిట్ట పోరు పిట్టపోరు పిల్లి తీర్చినట్టు పరిస్థితి వైసీపీకి అనుకూలంగా మారుతుందన్న విశ్లేషణలు సైతం ఉన్నాయి. పవన్‌కళ్యాణ్ నిర్ణయాన్ని బట్టి భీమవరం పరిస్థితులు ఎలా మారతాయో చూడాలి.

## భోగశ్రీనివాసుడికి సహస్రకలశాభిషేకం

తిరుమల, మే 24, తిరుమల శ్రీవారి ఆలయంలోని శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి మే 28వ తేదీన ప్రత్యేకంగా సహస్రకలశాభిషేకం జరగనుంది. 17 ఏళ్లుగా శ్రీవారి ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల నడుమ శ్రీవారి ఆలయంలోని బంగారువాకిలి చెంత భోగ శ్రీనివాసమూర్తికి అర్చకస్వాములు ఏకాంతంగా సహస్రకలశాభిషేకం నిర్వహిస్తారు. ఈ ఉత్సవంనాడు శ్రీవారి ఆలయంలోని ఆర్జిత సేవలన్నీ యథావిధిగా కొనసాగుతాయి. పల్లవ రాణి సామవాయి పెరుందేవి క్రీ.శ 614వ సంవత్సరంలో జ్యేష్ఠ మాసంలో 18 అంగుళాల పొడవు గల వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని తిరుమల శ్రీవారి ఆలయానికి కానుకగా సమర్పించారు. ఇందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఆలయంలో శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి సహస్రకలశాభిషేకం నిర్వహిస్తారు. పల్లవరాణి కానుకకు సంబంధించిన ఈ శాసనం ఆలయ మొదటి ప్రాకారంలోని విమాన వేంకటేశ్వరుని విగ్రహం కింది భాగంలో గోడపైన కనిపిస్తుంది. ఆగమం ప్రకారం శ్రీవారి ఆలయంలోని పంచబేరాల్లో ఒకరైన శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని కౌతుకమూర్తి అని, శ్రీ మనవాళపెరుమాళ్ అని కూడా పిలుస్తారు. మరోవైపు తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం శ్రీవారిని 78,349మంది భక్తులు దర్శించుకున్నారు. 39,634 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.. హుండీకి రూ. 4.56 కోట్ల ఆదాయం వచ్చినట్లు టీటీడీ తెలిపింది. 15 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనానికి వేచి ఉన్నారు. గూఆ టోకెన్లు లేని సర్వ దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. మే 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

# నెల్లూరు రూరల్ లో కోటంరెడ్డికి చెక్ సాధ్యమేనా

నెల్లూరు, మే 24, సాధారణంగా ప్రతి జిల్లాలో ఒకటో.. రెండో.. హాట్ సీట్లు ఉంటాయ్. అలాంటి వాటిలో.. కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లు మాత్రమే.. స్టేట్ మొత్తం హాట్ టాపిక్ గా మారుతుంటాయ్. అలాంటిదే.. నెల్లూరు రూరల్ కూడా. ఇక్కడ రాజకీయం ఎలా మారిందో.. ఇప్పుడెలా సాగుతుందో.. ఏపీ మొత్తం గమనిస్తూనే ఉంది. మరి.. వైసీపీ కి దూరంగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇలాఖాలో.. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీ తడాఖా చూపుతుందా? కోటంరెడ్డికి.. తెలుగుదేశం నేతలు సహకరిస్తారా? వైసీపీ నుంచి టికెట్ రేసులో ఉన్న లీడర్ ఎవరు? ఓవరాల్‌గా.. నెల్లూరు రూరల్‌లో ఈసారి కనిపించబోయే సీనేంటి?ఆంధ్రప్రదేశ్ మొత్తం ఒకరకమైన రాజకీయం కనిపిస్తే.. నెల్లూరు జిల్లా పాలిటిక్స్ మరో రకంగా ఉంటాయ్. ఇక్కడ.. ఏ ఎన్నికలు జరిగినా ఆసక్తికరంగానే ఉంటాయ్. ఒకప్పుడు.. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నెల్లూరు.. ఇప్పుడు వైసీపీకి అడ్డాగా మారిపోయింది. గత ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలను వైసీపీ క్లీన్ స్వీప్ చేసేసింది. అయితే.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం నెల్లూరు రూరల్‌లో.. నెక్ టు నెక్ ఫైట్ తప్పేలా లేదు. మాస్ లీడర్, సిట్టింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తో పాటు ఆర్థికంగా బలమైన నాయకులకు మధ్య పోటీ ఖాయంగా కనిపిస్తోంది. వైసీపీకి దూరంగా ఉన్న కోటంరెడ్డికి.. నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి మధ్యే ఆసక్తికర పోరు జరగబోతోందనే టాక్ మొదలైపోయింది. కొంతకాలంగా.. ఎమ్మెల్యే కోటంరెడ్డి.. వైసీపీ సర్కారును ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. మరోవైపు.. వివాదాస్పద రాజకీయాలకు దూరంగా ఉండే ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి.. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దాంతో.. నెల్లూరు రూరల్‌లో ఈసారి పోటీ ఓ రేంజ్‌లో ఉండటం ఖాయమనే చర్చ జరుగుతోంది. 2009లో ఏర్పడిన నెల్లూరు రూరల్ నియోజకవర్గం.. రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. ఈ సెగ్మెంట్ పరిధిలో.. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 26 డివిజన్లు, 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం.. 2 లక్షల 54 వేల మందికిపైనే ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకు మూడు సార్లు ఎన్నికలు జరిగాయి. 2009 ఎన్నికల్లో.. దివంగత నేత ఆనం వివేకానందరెడ్డి.. కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. ఇక.. గత రెండు ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి.. వరుసగా గెలుస్తూ వస్తున్నారు. మరోసారి బరిలో దిగి.. హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. అయితే.. వైసీపీ తరఫున గెలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి.. ఇప్పుడు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో.. ఆయన తెలుగుదేశం నుంచి పోటీ చేయడం ఖాయమంటున్నారు. అందువల్ల.. నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో జనంలోనే ఉంటున్నారు. ఆయనకు.. సోదరుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కూడా అండగా ఉండటం.. మరింత కలిసొచ్చే విషయంగా చెబుతున్నారు. మాస్ లీడర్ ఇమేజ్ సంపాదించుకున్న కోటంరెడ్డి.. ఏ పార్టీ తరఫున బరిలో దిగినా.. గెలవడం పక్కా అనేంత స్థాయికి వెళ్లిపోయారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలతో.. అనుమానం ఉన్న చోట తాను ఉండలేనని.. వైసీపీ దూరంగా జరిగారు కోటంరెడ్డి. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని.. వైసీపీ కూడా ఆయన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఆయన.. నియోజకవర్గ సమస్యలపై అధికార పార్టీని నిలదీస్తూ వస్తున్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ.. అధికార వైసీపీకి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. త్వరలోనే తెలుగుదేశంలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి.. టీడీపీ అభ్యర్థిగానే పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయ్. ఇప్పటికే ఆయన చంద్రబాబుని, లోకేశ్‌ని కలిసినట్లుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. ఈ మధ్యకాలంలో చంద్రబాబు, టీడీపీకి అనుకూలంగా కోటంరెడ్డి మాట్లాడిన సందర్భాలూ ఉన్నాయ్. అయితే.. కొన్ని నెలల ముందు వరకు.. తెలుగుదేశం పార్టీలోకి శ్రీధర్ రెడ్డి వద్దని వ్యతిరేకించిన పసుపు పార్టీ నేతలంతా.. ఇప్పుడు సైలెంట్ అయిపోయారు. వీళ్లంతా.. గతంలో ఎమ్మెల్యే కోటంరెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన వాళ్లే. అయితే.. కోటంరెడ్డి టీడీపీలో చేరి ఎన్నికల్లో పోటీ చేస్తే.. లోకల్ టీడీపీ నాయకులు సహకరిస్తారా? లేదా? అన్నదే.. ఇప్పుడు బిగ్ క్వశ్చన్. నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న అబ్దుల్ అజీజ్ కూడా రూరల్ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. నాలుగేళ్లుగా.. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. అనేకసార్లు ఎమ్మెల్యే కోటంరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. పరోక్షంగా కోటంరెడ్డి రాకను వ్యతిరేకిస్తున్నారు. పార్టీ ఆదేశిస్తే పోటీ చేసేందుకు తాను సిద్ధమని.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా.. రూరల్ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని చెబుతున్నారు అబ్దుల్ అజీజ్.వైసీపీ విషయానికొస్తే.. ఎమ్మెల్యే కోటంరెడ్డి సస్పెన్షన్ తర్వాత రూరల్ సెగ్మెంట్ ఇంచార్జ్‌గా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిని నియమించారు. రాబోయే ఎన్నికల్లో.. వైసీపీ నుంచి ఆయనే పోటీ చేస్తారని.. పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. అయితే.. ఆదాలకు ఇష్టం లేకపోయినా.. ఇంచార్జ్‌గా కొనసాగుతున్నారనే ప్రచారం సాగుతోంది. అందువల్ల.. ఆదాల ఇక్కడి నుంచే పోటీ చేస్తారా? లేదా? అనే దానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయ్. ఎందుకంటే.. ప్రభాకర్ రెడ్డి కూడా తెలుగుదేశంలోకే వెళతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. పైగా.. గత ఎన్నికల సమయంలో.. ఆదాల టీడీపీ అభ్యర్థిగా టికెట్ తెచ్చుకొని.. ప్రచారం చేస్తూ.. సడన్‌గా పసుపు జెండాని పక్కనబెట్టి.. వైసీపీలో చేరారు. ఇప్పుడు కూడా అదే సీన్ రిపీటవుతుందేమోనన్న



చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఈ అనుమానాలను, విమర్శలను కొట్టిపారేస్తూ.. గడప గడపకు ప్రభుత్వం ప్రోగ్రాంలో.. తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతారున్నారు ఆదాల ప్రభాకర్ రెడ్డి. వైసీపీ పాలన, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో.. రూరల్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని.. గెలిచి.. ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని చెబుతున్నారు. అలాగే.. ఎమ్మెల్యే కోటంరెడ్డిపై అవినీతి ఆరోపణలు కూడా చేస్తున్నారు. మరోవైపు.. ఆదాల ప్రభాకర్ రెడ్డికి నెల్లూరు రూరల్ నియోజకవర్గం కన్నా.. కావలి నుంచి పోటీ చేయాలనే ఆసక్తిగా ఎక్కువగా ఉందనే ప్రచారం కూడా సాగుతోంది. ఇక.. జిల్లా యూత్ ప్రెసిడెంట్ మాలెం సుధీర్ కుమార్ రెడ్డి పేరు కూడా వైసీపీ అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. సౌమ్యుడు, వివాదరహితుడిగా ఆయనకు పేరుంది. సీఎం జగన్ పార్టీ పెట్టక ముందు నుంచే.. ఆయన వెంట ఉన్నారు సుధీర్. ఓదార్పు యాత్రలోనూ.. జగన్ వెంటే ఉన్నారు. ఆయన బలమంతా.. నెల్లూరులో వేల మందితో కూడిన ఏసీ సుబ్బారెడ్డి కూరగాయ మార్కెటే. అంతేకాదు.. కార్మికులు, రైతులతోనూ మంచి సంబంధాలున్నాయ్. అటు.. ఆనం విజయ్ కుమార్ రెడ్డి కూడా వైసీపీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలో.. ఆనం ఫ్యామిలీకి కూడా మంచి పట్టుంది. విజయ్ కుమార్ రెడ్డిపై సీఎం జగన్‌కు కూడా మంచి అభిప్రాయమే ఉంది. గతంలో.. ఆయనకు డీసీసీబీ ఛైర్మన్ పదవి ఇచ్చారు. ఆయన సతీమణి అరుణ జడ్పీ ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ముందు నుంచీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, ఆనం విజయ్ కుమార్ రెడ్డి మధ్య విభేదాలున్నాయి. వైసీపీ తరఫున ఆశావహులు ఎక్కువే ఉన్నా.. శ్రీధర్ రెడ్డి, ఆదాల మధ్య మాత్రమే పోటీ ఓ రేంజ్‌లో ఉండబోతుందనే చర్చ ఎక్కువగా సాగుతోంది.

# ప్రకాశవంతమైన చర్మం కోసం రోజు రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ ఇలా వాడండి



ప్రకాశవంతమైన చర్మ సంరక్షణ పొందడం ఖచ్చితంగా ఒక రాత్రిలో మాత్రమే సాధించగల అద్భుతం కాదు. అందుకే మీరు సరైన చర్మ సంరక్షణా విధానాలను అనుసరించాలి మరియు మీ చర్మానికి సరైన పదార్థాలను ఉపయోగించాలి. గ్లిసరిన్ మరియు రోజ్ వాటర్ మహిళల చర్మ ఆరోగ్యాన్ని పెంచడంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. గ్లిజరిన్ మరియు రోజ్ వాటర్ బ్లీచింగ్, ముఖ్యంగా ముఖం మీద (మీ అలెర్జీ చర్మం కాకపోతే) చాలా ప్రయోజనాన్ని అందిస్తుంది మరియు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చర్మం మరియు ముఖానికి గ్లిజరిన్ మరియు రోజ్ వాటర్ ఎలా ఉపయోగించాలో దాని గురించి మరింత చదవండి. చర్మాన్ని తేమగా ఉంచుతుంది ఇది చర్మానికి అవరోధం అందిస్తుంది. ట్రాన్స్డెర్మల్ నీటి నష్టం లేదా బాహ్యచర్మం ద్వారా శరీరం కోల్పోయిన నీరు) మీ చర్మం యొక్క సాధారణ పనితీరును ప్రతిబింబించే ఒక ముఖ్యమైన అంశం. గ్లిజరిన్ ని క్రమం తప్పకుండా వాడటం వల్ల ని నివారించవచ్చు మరియు చర్మాన్ని తేమగా ఉంచుతుందని ఒక అధ్యయనం చూపించింది. 2. చర్మం పొడిబారడం తగ్గిస్తుంది మీ చర్మం నిర్జలీకరణమైతే మరియు అటోపిక్ చర్మశోథతో సమస్య ఉంటే, మీ చర్మం ఖచ్చితంగా గ్లిజరిన్ ను ఇష్టపడుతుంది. ఇప్పటికే చెప్పినట్లుగా, గ్లిసరిన్ ఒక హేమెక్టాంట్, ఇది వాతావరణంలో తేమను ఆకర్షిస్తుంది మరియు చర్మాన్ని పొడిగా ఉంచడానికి సహాయపడుతుంది. 3. స్కిన్ ఎలాసిటి పెంచుతుంది మనిషి చర్మం తక్కువ పారగమ్యంగా ఉంటుంది. అంటే విదేశీ పదార్థాలు చర్మ పొరలోకి చొచ్చుకుపోయి చొరబడగలవు. కొన్ని చర్మ సంరక్షణ ఉత్పత్తులు మీ చర్మంపై అదే కారణంతో పనిచేయవు. గ్లిసరాల్ (వాణిజ్యపరంగా గ్లిజరిన్ అని పిలుస్తారు) చర్మ ప్రాప్తి అవకాశాలను పెంచడానికి సహాయపడుతుంది. రోజ్ వాటర్ వల్ల చర్మానికి కలిగే ప్రయోజనాలు: 1. చర్మం సున్నితమైనది మీకు పొడి లేదా వృద్ధాప్య చర్మం ఉంటే, రోజ్ వాటర్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది యాంటీ ఏజింగ్ లక్షణాలను కలిగి ఉంటుంది మరియు దీనిని క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల మీ చర్మం ఈ సమస్య నుండి బయటపడవచ్చు. ఇది మీ చర్మం యొక్క శ్వాస ప్రక్రియకు సహాయపడుతుంది మరియు చర్మం పొరను ఆప్టిమైజ్ చేస్తుంది మరియు చర్మం ఎరుపును నివారిస్తుంది. 2. ఇది మంట ప్రభావాలను నివారించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది గులాబీ పువ్వులలో టానిన్లు, ఆంథోసైనిన్లు మరియు ముఖ్యమైన నూనెలు ఉంటాయి. గులాబీ యొక్క ఈ రసం శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంది మరియు ఫైబ్రోబ్లాస్ట్ కణాలను రక్షించగలదు. (ఈ కణాలు కొల్లాజెన్ సంశ్లేషణకు కారణమైన కణాలు. ఇవి చర్మ నష్టం) 3. చర్మానికి రోజ్ వాటర్ అప్లై చేయడం వల్ల మీ చర్మానికి రోజ్ వాటర్ అప్లై చేయడం వల్ల చర్మం ప్రశాంతంగా ఉంటుంది మరియు మీకు చల్లగా ఉంటుంది. ఇది మీ చర్మానికి హైడ్రేటింగ్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది, ముఖ్యంగా ఇది మీ చర్మానికి రోజంతా సౌకర్యవంతమైన అనుభూతిని ఇవ్వడానికి సహాయపడుతుంది. మీ చర్మంపై సూర్యకిరణాల దుష్ప్రభావాలను నివారించడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. రోజ్ వాటర్‌లో ఇతర రసాయనాలు మార్కెట్‌లో లభిస్తాయి, ఇవి మీ చర్మానికి హానికరం. కాబట్టి మీరు ఇంట్లో గులాబీ రసం తయారు చేయగలిగినంత గులాబీ రేకులను ఉపయోగించడం మరియు రోజ్ వాటర్ ను ఉపయోగించడం ద్వారా మీ చర్మానికి మంచి ఫలితాలను పొందవచ్చు. ఈ రెండు పదార్థాలు మీ చర్మాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో ఇప్పుడు చూద్దాం. కాబట్టి దీన్ని ఎలా ఉపయోగించాలి? గ్లిజరిన్ మరియు రోజ్ వాటర్ ఉపయోగించి ముఖంలో ఎలా చైతన్యం నింపాలో మేము మీకు కొంత సమాచారం ఇస్తున్నాము. ముఖంలో గ్లిజరిన్ మరియు రోజ్ వాటర్ ఎలా ఉపయోగించాలి? గమనిక: మీ చర్మంలోకి నేరుగా గ్లిసరిన్ వాడటం మానుకోండి. రోజ్ వాటర్ ద్రావణాన్ని ఎల్లప్పుడూ వాడండి. మీరు దీన్ని నేరుగా ఉపయోగిస్తే, ఇది కొన్ని దుష్ప్రభావాలను కలిగిస్తుంది మరియు గ్లిజరిన్ మీ చర్మాన్ని డ్రైగా మార్చుతుంది. 1. రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ టోనర్ కావల్సినవి 4 టేబుల్ స్పూన్లు రోజ్ వాటర్ 2 టేబుల్ స్పూన్లు గ్లిజరిన్ వెంటిలేషన్ చేయలేని స్ప్రే బాటిల్ విధానం: రెండు వస్తువులను స్ప్రే బాటిల్‌లో కలపండి. బాగా కలపడానికి సరిగ్గా కదిలించండి ముఖం పొడిగా ఉన్నప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖం మీద చిలకరించండి లేదా స్ప్రే చేయాలి. 2. రోజ్ వాటర్ మరియు గ్లిసరన్ మిక్స్ మేకప్ సెట్టింగ్ స్ప్రే కావల్సినవి 4 టేబుల్ స్పూన్లు గ్లిజరిన్ 6 టేబుల్ స్పూన్లు రోజ్ వాటర్ 2 టేబుల్ స్పూన్లు హాజెల్వా టేబుల్ స్పూన్ టీ ట్రీ ఆయిల్ (అవసరం అయితే) స్ప్రే బాటిల్ విధానం: ఒక గరాటు ఉపయోగించి అన్ని పదార్థాలను స్ప్రే బాటిల్‌లో ఉంచండి. సున్నితంగా కదిలించండి. క్యాప్ ను మార్చండి మరియు మీ చేతుల మధ్య బాటిల్ ఉంచండి మరియు పదార్థాలను శాంతముగా కదిలించండి (చాలా గట్టిగా కదిలించవద్దు) మెల్లగా కదిలించి ముఖం మీద స్ప్రే చేయాలి. ఇది ఎలా సహాయపడుతుంది? చర్మంలో మంట మరియు మొటిమలతో పోరాడే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు విట్స్ హాజెల్ లో కనిపిస్తాయి. టీ ట్రీ ఆయిల్ మీ చర్మాన్ని బ్యాక్టీరియా, వైరస్లు మరియు ఇతర తెగుళ్ళ నుండి రక్షిస్తుంది, అలాగే మీ చర్మానికి శీతలీకరణ అనుభూతిని అందిస్తుంది. 3. రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ ఫేషియల్ ప్రక్షాళన కావల్సినవి 1వా కప్పు రోజ్ వాటర్ 2 టేబుల్



స్పూన్లు సువాసన లేని కాస్టిల్ సబ్బు 1 టేబుల్ స్పూన్ గ్లిజరిన్ 1 టేబుల్ స్పూన్ విటమిన్ ఇ ఆయిల్ గాలితో లేని 1 గాజు కూజా విధానం: అన్ని పదార్థాలను ఒక గిన్నెలో ఉంచండి. ప్రతిదీ సరిగ్గా కలిసే వరకు కొన్ని సెకన్ల పాటు బాగా కదిలించండి. ప్రతిదీ ఒక గాజు కూజాలో ఉంచండి. ప్రతిరోజూ మీ ముఖాన్ని కడగడానికి ఈ మిశ్రమాన్ని ఉపయోగించండి. ఇది మీకు ఎలా సహాయపడుతుంది? కాస్టిల్ సబ్బు మీ చర్మంపై సున్నితంగా ఉంటుంది మరియు మొటిమలను నివారించడంలో సహాయపడుతుంది. విటమిన్ ఇ చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా కాపాడుతుంది మరియు కంటి చుట్టూ ఉన్న నల్లటి వలయాలను రక్షించడానికి సహాయపడుతుంది. 4. రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ మిక్స్ ఫేషియల్ మాస్క్ వల్సినవి 1 టేబుల్ స్పూన్ గ్లిజరిన్ 1 టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ నీటి సీరం యొక్క 2-3 చుక్కలు (మీకు ఇష్టమైన సీరం ఎంచుకోండి) 1 త్రోయబుల్ కాటన్ షీట్ మాస్క్ విధానం: అన్ని పదార్థాలను ఒక గిన్నెలో వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కాటన్ షీట్ మాస్క్‌లో ముంచండి. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాలు అలాగే ఉంచండి. ఇది ఎలా సహాయపడుతుంది? ఈ సీరం మొటిమలు, పొడిబారడం, చర్మ దద్దుర్లు, నల్ల మచ్చలు వంటి అనేక చర్మ సమస్యలను పరిష్కరిస్తుంది. 5. రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ మాయిశ్చరైజర్



మీకు అవసరమైన సామగ్రి: 1 టేబుల్ స్పూన్ గ్లిజరిన్ 4 టేబుల్ స్పూన్లు రోజ్ వాటర్ ఒక గ్లాస్ బాటిల్ విధానం: గ్లాస్ డ్రాప్పర్ బాటిల్‌లో అన్ని పదార్థాలను కలపండి. బాటిల్ మూత కవర్ చేసి బాగా కదిలించండి. మీ ముఖానికి రెండు మూడు చుక్కలు వేసి బాగా మసాజ్ చేయండి. రోజూ రెండుసార్లు ఇలా చేయండి. పడుకునే ముందు ఉదయం మరియు రాత్రి మసాజ్ చేయండి. 6. రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ సీరం కావల్సినవి 2 టేబుల్ స్పూన్లు గ్లిజరిన్ 1 టేబుల్ స్పూన్ రేసు నీరు (డిస్టిల్ వాటర్) 2 టేబుల్ స్పూన్లు అలవిరా జల్వా టేబుల్ స్పూన్ ఆర్గాన్ ఆయిల్ 5 చుక్కల జెరేనియం ముఖ్యమైన నూనె 1 గ్లాస్ బాటిల్ 1 ట్యూబ్ విధానం: గ్లాస్ డ్రాప్పర్ బాటిల్‌లో అన్ని పదార్థాలను కలపండి. పదార్థాలు చిందించకుండా చూసుకోవడానికి ఒక గరాటు ఉపయోగించండి. ఒక బాటిల్ మూత పెట్టి మీ చేతుల మధ్య ఉంచి బాగా షేక్ చేయాలి. ఈ సీరం చల్లని ప్రదేశంలో నిల్వ చేయండి. ప్రతి రాత్రి పడుకునే ముందు, కొన్ని చుక్కల సీరం మీ చేతుల్లోకి మసాజ్ చేసి, ఆపై మీ ముఖానికి మసాజ్ చేయండి. ఈ సీరం మీ సౌలభ్యం వద్ద లేదా రాత్రి పూయండి. ఇది ఎలా సహాయపడుతుంది? అలవిరా జెల్ %ఖఎ% కిరణాల నుండి చర్మాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఇది చర్మం యొక్క స్థితిస్థాపకతను పెంచుతుంది. ఇది చర్మంలోని ముడుతలను కూడా నివారిస్తుంది. ఆర్గాన్ ఆయిల్ చర్మ ఆరోగ్యాన్ని పెంచుతుంది మరియు చర్మం యొక్క ఆర్ద్రీకరణ మరియు మృదువుగా సహాయపడుతుంది. జెరేనియం నూనె మొటిమలను తొలగిస్తుంది, ఇది చర్మం వృద్ధాప్యాన్ని నిరోధిస్తుంది. ఇది సెబమ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. 7. రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ ఫేస్ మిస్ట్ కావల్సినవి రోజ్ వాటర్ కప్ 2 టేబుల్ స్పూన్లు గ్లిజరిన్ కప్ స్వేదనజలం స్ప్రే బాటిల్ విధానం: స్వేదనజలం స్ప్రే బాటిల్‌లో పోయాలి. అన్ని పదార్థాలు వేసి బాగా కలపాలి. మీ ముఖం మీద పిచికారీ చేసి, ముఖాన్ని గ్రహించే వరకు అలాగే ఉంచండి. మీ చర్మానికి అవసరమైనప్పుడు దీనిని ఉపయోగించవచ్చు. రోజంతా వాడకంతో సంబంధం లేకుండా, అది పట్టింపు లేదు. 8. రోజ్ వాటర్, గ్లిసరిన్ మరియు నిమ్మకాయ మిశ్రమ స్కిన్ టోనర్ కావల్సినవి 1/2 కప్పు రోజ్ వాటర్ గ్లిజరిన్ 5 చుక్కలు సగం నిమ్మరసం విధానం: రోజ్ వాటర్‌తో నిమ్మరసం రసం కలపండి. ఈ మిశ్రమానికి గ్లిజరిన్ కూడా కలపండి. ఈ మిశ్రమాన్ని ఒక గాజు సీసాలో భద్రపరుచుకోండి. టోనర్‌గా ఉపయోగించడానికి పత్తి గుళికలను ఉపయోగించండి. 10 నుండి 15 నిమిషాల కన్నా ఎక్కువ ముఖంపై ఉంచి. తర్వాత ముఖం కడగాలి. ప్రతిరోజూ ఒకసారి వాడండి. ఇది ఎంత సహాయకారిగా ఉంటుంది? నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తస్రావ నివారిణిగా పనిచేస్తుంది మరియు స్కిన్ టోన్ను కాంతివంతం చేస్తుంది. గమనిక: చర్మంపై పలుచన నిమ్మరసం ఎప్పుడూ ఉపయోగించవద్దు. అలాగే, నిమ్మరసం యొక్క రసం చర్మాన్ని ఫోటోసెన్సిటివ్‌గా చేస్తుంది కాబట్టి మీరు ఎండలోకి వెళ్లేముందు సన్‌స్క్రీన్ పొందాలి. రెండు పదార్థాలు చర్మానికి ఎటువంటి హాని చేయవు అనేది నిజం. కానీ మీకు అలెర్జీ చర్మం ఉంటే దాన్ని వాడకపోవడమే మంచిది. ఇవన్నీ మీ చర్మంపై ప్రయత్నించే ముందు కొన్ని చిట్కాలను పాటించడం మంచిది. ఆ చిట్కాల జాబితా ఇక్కడ ఉంది. ముఖం కోసం గ్లిసరిన్ మరియు రోజ్ వాటర్ ఉపయోగించే ముందు మీరు పరిగణించవలసిన కొన్ని చిట్కాలు: లి మీరు మీ చర్మానికి గ్లిసరిన్ వర్తించే ముందు, మొదట ప్యాచ్ టెస్ట్ చేయండి. మీ చర్మానికి గ్లిజరిన్ మరియు రోజ్ వాటర్ ఉపయోగించే ముందు చర్మవ్యాధి నిపుణుడిని సంప్రదించడం కూడా మంచిది. అప్పుడు అలెర్జీ పరీక్షను ఉపయోగించవచ్చు. లి మీరు జిడ్డుగల చర్మం లేదా మిశ్రమాలను కలిగి ఉంటే వారానికి రెండుసార్లు కంటే ఎక్కువ వాడకండి. మితిమీరిన వాడకం వల్ల మీ చర్మం జిడ్డుగా కనిపిస్తుంది. లి శుభ్రమైన రోజ్ వాటర్ (వీలైనంత ఇంట్లో తయారుచేయండి) మరియు సేంద్రీయ గ్లిసరిన్ వాడండి. ఇది చర్మంపై చెడు ప్రభావాలను నివారించగలదు. మార్కెట్లో లభించే రోజ్ వాటర్ మీ చర్మానికి హాని కలిగించే కొన్ని అదనపు పదార్థాలను జోడించవచ్చు. రోజ్ వాటర్ రుచి కోసం సంరక్షణకారులను మరియు కొన్ని రసాయనాలను ఉపయోగించే అవకాశం ఉందని దీని అర్థం. లి రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ రెండూ బాగా పలుచబడి ఉన్నాయని మరియు బయటకు వెళ్ళే ముందు మాత్రమే కడిగివేయబడతాయని నిర్ధారించుకోండి. కరిగించని గ్లిసరిన్ దుమ్ము, పొగ మరియు కలుషితానికి గురవుతుంది మరియు మీ చర్మం రంధ్రాల గుండా వెళ్లి చర్మానికి హాని కలిగిస్తుంది. గ్లిసరిన్ మరియు రోజ్ వాటర్ దుష్ప్రభావాలు లి ముఖం అందాన్ని పెంపొందించడానికి రెండు పదార్థాలు సురక్షితమైనవి అని చెబుతారు. అయితే, రెండు పదార్థాలకు అలెర్జీ వచ్చే అవకాశాన్ని కొందరు ఖండించలేరు. ఎర్రబడాలి దద్దుర్లు అవుతోంది మండుతున్న అనుభవంగా ఉంది స్టింగ్ సంచలనం కావడం నొప్పి పైన పేర్కొన్న ఏవైనా లక్షణాలు లేదా చర్మ మార్పులను మీరు వేరే విధంగా గమనించినట్లయితే, ఈ ఉత్పత్తులను వాడటం మానేసి వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి. రోజ్ వాటర్ మరియు గ్లిసరిన్ మీ చర్మానికి అనేక విధాలుగా సహాయపడతాయి. కానీ మీ ముఖం మీద ఏదైనాసహజపదార్థాలను ముందు మీరు జాగ్రత్తగా ఉండాలి.

# డయాబెటిస్ డైట్: డయాబెటిస్ ఉన్నవారికి నీటి కంటే ఉత్తమమైన పానీయాలు ఇవి



డయాబెటిస్ దీర్ఘకాలిక వ్యాధి, దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా నిర్వహించడం అవసరం. ఆరోగ్యకరమైన రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మీ ఆహారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మీ ఆహారాన్ని ప్లాన్ చేయడానికి ముందు, డయాబెటిస్ ఉన్న వారు మీ రక్తంలో చక్కెర స్థాయిలపై తీసుకునే ఆహారం యొక్క ప్రభావాన్ని చెక్ చేయాలి. చాలా పానీయాలు అదనపు చక్కెరతో లోడ్ చేయబడతాయి, ఇవి మీ రక్తంలో చక్కెర స్థాయిలలో హెచ్చుతగ్గులను సృష్టించగలవు. ప్యాక్ చేసిన రసాలు కూడా చాలా తక్కువ పోషకాలతో చక్కెరతో లోడ్ అవుతాయి. మీరు తాజా పండ్ల రసాన్ని తీసుకుంటుంటే, తక్కువ మొత్తంలో రసం తయారు చేయడానికి మీకు పెద్ద మొత్తంలో పండ్లు అవసరం. ఇది అధిక చక్కెర వినియోగానికి కూడా దోహదం చేస్తుంది. అదేవిధంగా, ఎక్కువ ప్యాక్ చేసిన పానీయాలు చక్కెరతో లోడ్ చేయబడతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు సురక్షితమైన ఎంపికలు చాలా తక్కువ. డయాబెటిస్ వారి ఆహారంలో చేర్చే కొన్ని పానీయాలు ఇక్కడ ఉన్నాయి. ఇవి నీటికి ప్రత్యామ్నాయంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచిదని సూచిస్తున్నారు. డయాబెటిస్ డైట్: డయాబెటిస్ వారి కోసం ఆరోగ్యకరమైన పానీయాలు 1. కూరగాయల రసం కూరగాయలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. రోజంతా తగినంత కూరగాయలు తినాలి. మీరు ఎంచుకోవడానికి రకరకాల కూరగాయలు ఉన్నాయి. తాజా మరియు పోషక-దట్టమైన రసాన్ని తయారు చేయడానికి మీకు ఇష్టమైన కూరగాయలను కలపవచ్చు. ఆకుకూరలు ఎంచుకోవడం ఉత్తమమైనవి. కూరగాయల సరంలో చక్కెర స్థాయిలు తక్కువగా ఉంటాయి. అయితే పండ్ల విషయంలో దాదాపు అన్ని పండ్లలో చక్కెర ఉంటుంది. కాబట్టి మీకు నచ్చిన టమోటాలు లేదా ఇతర కూరగాయలను సిప్ చేయడానికి బదులుగా, రసం పిండేసి త్రాగాలి. ఇంకా మంచిది, మందపాటి ఆకు కూరలు, సెలెరీ, దోసకాయ మరియు కొన్ని బెర్రీల నుండి మీరు విటమిన్లు మరియు ఖనిజాలను మంచి మొత్తంలో పొందవచ్చు. 2. కాఫీ ఫ్రీ డయాబెటిస్ లేదా మధుమేహ వ్యాధిగ్రస్తులు! మీరు కాఫీ తాగవచ్చు. అధ్యయనాల ప్రకారం కాఫీ తాగడం వల్ల డయాబెటిస్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది. మీరు మీ డయాబెటిస్ డైట్‌లో కాఫీని జోడించాలనుకుంటే, దానికి క్రీమ్ జోడించవద్దు. అలాగే, చక్కెర లేని కాఫీని తీసుకోవడం ఉత్తమం. 3. హెర్బల్ టీ టీలో ఆరోగ్య ప్రయోజనాల పుష్కలంగా ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు టీ లేదా పాలు తీసుకోవడం ఆరోగ్యకరమైన ఎంపిక కాదు. అయితే వీటికి బదులుగా, మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉన్న మూలికా టీలను ఎంచుకోవచ్చు. ఎంచుకోవడానికి అనేక మూలికా టీలు ఉన్నాయి. వీటిలో కొన్ని రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా మీకు సహాయపడతాయి. సరైన టీని ఎంచుకోవడానికి మీ డాక్టర్ నుండి సిఫార్సులు తీసుకోండి. 4. తక్కువ కొవ్వు పాలు మీ ఆహారంలో పాల ఉత్పత్తులు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఈ ఉత్పత్తులు అనేక ఆరోగ్య ప్రయోజనాలతో లోడ్ చేయబడతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆహారంలో పాలను చేర్చవచ్చు కాని తియ్యని మరియు తక్కువ కొవ్వు గల పాలను ఎంచుకోవచ్చు. మీ రక్తంలో చక్కెర స్థాయిల ప్రకారం భాగం పరిమాణం గురించి మీరు ఒకసారి మీ వైద్యుడిని అడిగి తెలుసుకోవాలి. 5. నీరు ప్రతి ఒక్కరి శరీరానికి నీరు అవసరం. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా నీరు చాలా అవసరం. ఎందుకంటే నీటికి కేలరీలు లేవు, చక్కెర లేదు. రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉంటే, డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మరియు స్థిరంగా నీరు తాగుతూ ఉండాలి. ఇది ఎప్పటికప్పుడు రక్తంలో అదనపు గ్లూకోజ్ మూత్ర విసర్జనను అనుమతిస్తుంది. మగ మధుమేహ వ్యాధిగ్రస్తులు పగటిపూట పదమూడు కప్పుల నీరు తాగాలి. మహిళల మధుమేహ వ్యాధిగ్రస్తులు సుమారు తొమ్మిది కప్పులు తాగాలి. మీకు సాదా నీరు నచ్చకపోతే, మీరు కొద్దిగా నిమ్మరసం లేదా నారింజ రసంతో కలపవచ్చు. ఇంకా మంచి పద్ధతి ఏమిటంటే తులసి, పుదీనా లేదా ఆకుపచ్చ ఆకులను నీటిలో త్రాగటం. ప్రత్యామ్నాయంగా, మీరు రాస్బెర్రీ పండ్లను కలపవచ్చు మరియు తినవచ్చు.



# స్కిన్ అలర్జీ మరియు స్కిన్ రాషెస్ ను తొలగించే హోం రెమెడీస్



హోం రెమెడీస్ లో మీరు తయారు చేయగల ఈ సహజ చర్మ సంరక్షణ ఉత్పత్తులతో చర్మ అలెర్జీలు మరియు దద్దుర్లు నివారించవచ్చు. చర్మ అలెర్జీని నివారించడానికి, మీరు సహజ ఉత్పత్తులను ఉపయోగించి మీ చర్మానికి మంచి ఫలితాలను పొందవచ్చు మరియు ఇక్కడ మీరు వాటిని ఇంట్లో ఎలా తయారు చేసుకోవచ్చు మరియు ఎలా ఉపయోగించవచ్చు తెలుసుకుందాం.. మీరు ఇంట్లో తయారు చేయగల ఈ సహజ చర్మ సంరక్షణ ఉత్పత్తులతో చర్మ అలెర్జీలు మరియు దద్దుర్లు నివారించండి. చర్మ సంరక్షణ ఉత్పత్తులలోని కొన్ని సమ్మేళనాల వల్ల చర్మ అలెర్జీలు మరియు దద్దుర్లు వస్తాయని ఇటీవలి అధ్యయనం వెల్లడించింది. ఇక్కడ మీరు చర్మ ప్రక్షాళన, చర్మంపై డెడ్ స్కిన్ సెల్స్ ఊడిపోవడం మరియు తేమ కోసం సహజ ఉత్పత్తులను ఎలా ఉపయోగించవచ్చో చూద్దాం.. మన శరీరంలో చర్మం అతిపెద్ద ఇంద్రియ అవయవం, మరియు ఏదైనా మన శరీరంలోకి ప్రవేశించడానికి మొదటిగా అవరోధం కలిగించేది చర్మం, ఎండ, గాలి, చలి, వేడి నుండి మన శరీరాన్ని చర్మం ఒక కవచంలా కాపాడుతుంది. మన చర్మం చాలా వరకు వెళుతుంది - మరియు చలి, శీతాకాలంలో కొంచెం అదనంగా బాధపడవచ్చు. ఇక్కడే చర్మ సంరక్షణ పాత్ర వస్తుంది, మరియు ప్రజలు వారి చర్మం ఆరోగ్యంగా ఉండేలా చూడటానికి పెద్ద వాదనలు చేసే వివిధ చర్మ సంరక్షణ ఉత్పత్తులను ఉపయోగిస్తారు. ఏదేమైనా, వ్యక్తిగత మరియు చర్మ సంరక్షణ ఉత్పత్తులు మంచి కంటే హాని ఎలా చేస్తాయో తాజా అధ్యయనం కనుగొంది. సైన్స్ ఇమ్యునాలజీ పత్రికలో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, చర్మ సంరక్షణ ఉత్పత్తులలోని కొన్ని రసాయనాలు రోగనిరోధక వ్యవస్థ యొక్క టి-కణాల నుండి ప్రతిచర్యను ప్రేరేపించగలవని, ఇది అలెర్జీకి దారితీస్తుందని కనుగొన్నారు. ఇటువంటి అలెర్జీలను నివారించడానికి, మీరు సహజ ఉత్పత్తులను ఉపయోగించి మీ చర్మానికి మంచి ఫలితాలను పొందవచ్చు మరియు ఇక్కడ మీరు వాటిని ఇంట్లో ఎలా తయారు చేసుకోవచ్చు మరియు ఉపయోగించవచ్చో తెలుసుకుందాం. మీ ముఖాన్ని శుభ్రపరచడానికి పచ్చి పాలు మీ ముఖాన్ని శుభ్రం చేయడానికి, ఒక గిన్నెలో ఒక పంచా పచ్చిపాలు తీసుకొని, అందులో ఒక పత్తి బంతిని ముంచండి. మీ చర్మంపై పాలను వ్యాప్తి చేయడానికి పత్తి బంతిని ఉపయోగించండి మరియు నీటితో కడగడానికి ముందు రెండు నిమిషాలు అలాగే ఉంచండి. పాలలోని లాక్టిక్ ఆమ్లం ట్యాన్ తగ్గించడానికి, వడదెబ్బ నుండి ఉపశమనం కలిగించడానికి, చర్మానికి తగిన తేమను అందివ్వడానికి, పొడి చర్మాన్ని నయం చేయడానికి మరియు రంధ్రాలను శుభ్రపరచడానికి సహాయపడుతుంది.

డెడ్ స్కిన్ సెల్స్ తొలగించడానికి శెనగపిండి మరియు పెరుగు మీ ముఖాన్ని శుభ్రపరిచిన తరువాత, మీరు శెనగపిండి లేదా బేసాన్ మరియు పెరుగును కలపాలి. ఈ మిశ్రమం చర్మంలో డెడ్ స్కిన్ తొలగించడం కోసం ఉపయోగించవచ్చు. శెనగపిండి చర్మానికి చాలా ఆరోగ్యకరమైనది, మరియు చిన్న కణికలు మీ రంధ్రాలను పూర్తిగా శుభ్రపరచడంలో సహాయపడతాయి. పెరుగు వైద్యం చేసే లక్షణాలను కలిగి ఉంటుంది మరియు ట్యాన్, చర్మశుద్ధికి మరియు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఈ మిశ్రమాన్ని ముఖానికి వర్తించండి, పూర్తిగా ఆరనివ్వండి మరియు సున్నితమైన నీటితో శుభ్రం చేసుకోండి. శెనగపిండిని తీసేటప్పుడు, మీ ముఖ చర్మాన్ని పైకి రుద్దండి. ఇలా చేయడం వల్ల మీ చర్మం సున్నితంగా ఉంటుందని నిర్ధారించుకోండి.

# త్రిపుర పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్‌గా.. గంగూలీ



అగర్తలా, మే 24, ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ కేప్టెన్ సౌరవ్ గంగూలీకి కీలక బాధ్యతలు అప్పగించింది కేంద్ర ప్రభుత్వం. త్రిపుర టూరిజం బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించింది. త్రిపుర ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహా ఈ విషయం అధికారికంగా వెల్లడించారు. గంగూలీకి కాల్ చేసి మాట్లాడిన ఆయన...రాష్ట్ర పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో దాదా కీలక పాత్ర పోషిస్తారన్న నమ్మకముందని వెల్లడించారు. తమ నిర్ణయానికి గంగూలీ అంగీకారం తెలిపారని సంతోషం వ్యక్తం చేశారు. "ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ కేప్టెన్ సౌరవ్ గంగూలీ మా మాటకు, నిర్ణయానికి గౌరవమివ్వడం చాలా సంతోషంగా ఉంది. త్రిపుర పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలన్న మా ప్రతిపాదనకు ఆయన అంగీకరించారు. ఇదే విషయమై ఆయనతో నేను ఫోన్‌లో మాట్లాడాను. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషిస్తారన్న నమ్మకముంది"త్రిపుర పర్యాటక మంత్రి సుశాంత చౌదరి గంగూలీ ఇంటికి వెళ్లి కలిశారు. ఆయనతో పాటు మరి కొందరు దాదాను కలిసి అభినందనలు తెలిపారు. సుశాంత చౌదరితో కాసేపు మాట్లాడిన గంగూలీ...ప్రభుత్వ ప్రతిపాదనకు అంగీకరిస్తున్నట్టు చెప్పారు. ఎప్పుడు పిలిచినా ఆ రాష్ట్రానికి రావడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు దాదా. గంగూలీ త్వరలోనే విదేశాల్లో పర్యటించనున్నారు. ఆ టూర్ పూర్తైన తరవాత త్రిపురకు వెళ్లే అవకాశాలున్నాయి. ప్రస్తుతం అందిన సమాచారం ప్రకారం...జూన్ నెలాఖరుకి త్రిపురకు వెళ్తారు. త్రిపురలోని బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇకో టూరిజం, టీ టూరిజం లాంటి కొత్త విధానాలతో అందరినీ ఆకర్షించింది. అయితే..ఈ నిర్ణయాన్ని ప్రకటించిన వెంటనే వెస్ట్‌బెంగాల్‌లోని హుగ్లీలో బీజేపీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి సందడి చేశారు. ఈ హడావుడి కారణంగా...మరోసారి దాదా పొలిటికల్ ఎంట్రీపై చర్చ జరుగుతోంది. చాలా రోజులుగా బీజేపీతో సన్నిహితంగా ఉంటున్నారు గంగూలీ. 2021లో జరిగిన వెస్ట్ బెంగాల్ ఎన్నికల్లోనే సౌరవ్ గంగూలీ బీజేపీలో చేరతారన్న ఊహాగానాలు వచ్చాయి. కానీ...రాజకీయాలకు దూరంగా ఉంటానంటూ ప్రకటించారు దాదా. 2019లో సౌరవ్ గంగూలీని ఃఅఅఎ ప్రెసిడెంట్‌గా నియమించారు. అప్పుడే దాదా పొలిటికల్ ఎంట్రీపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఆయన బీజేపీ తరపున ప్రచారం చేయడమే కాకుండా..పోటీ కూడా చేస్తారని కూడా అన్నారు. కానీ...ఆ తరవాత దాదా క్లారిటీ ఇచ్చారు. ఆ తరవాత 2021లో గంగూలీకి మైల్డ్ హార్ట్ అటాక్ వచ్చింది. అప్పుడు కేంద్రహోం మంత్రి అమిత్‌షా స్వయంగా వెళ్లి పరామర్శించారు. డిన్నర్ కూడా చేశారు. 2021లో బెంగాల్‌లో ఎన్నికలు జరిగాయి. కానీ...దాదా మాత్రం రాజకీయాలకు దూరంగానే ఉన్నారు. అందరూ అనుకున్నట్టుగా బీజేపీలో చేరలేదు. అయితే..ఎప్పుడైతే బీసీసీఐ ప్రెసిడెంట్‌గా ఆయన పదవీ కాలం ముగిసిందో..అప్పుడు మరో చర్చ మొదలైంది. ఆయన బీజేపీలో చేరలేదు కాబట్టే ఆయనను పదవిలో కొనసాగించలేదని ఎఓఅ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అయితే..ఇప్పుడు త్రిపుర పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల మరోసారి దాదా రాజకీయాల్లోకి వస్తారా..? అన్న ఆసక్తికర చర్చ జరుగుతోంది

# ధోనీ మైండ్‌గేమ్.. హార్దిక్ ప్యాండా ఔట్..



చెన్నై: ఐపీఎల్ 2023) క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో చెన్నై జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌లో గుజరాత్ జట్టు కెప్టెన్ హార్ధిక్ పాండ్యా వికెట్‌ను .. సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ చాలా తెలివిగా దక్కించుకున్నాడు. బ్యాటింగ్ కోసం హార్దిక్ క్రీజ్‌లోకి వచ్చినప్పుడు.. ధోనీ తన ఫీల్డింగ్ పొజిషన్‌ను మార్చేశాడు. గుజరాత్ కెప్టెన్ హార్దిక్‌ను తన మైండ్‌గేమ్‌తో ధోనీ కన్ఫ్యూజ్ చేశాడు. చివరకు ధోనీ వేసిన ట్రిక్కులో.. హార్దిక్ ట్రాప్ అయ్యాడు.తొలి 5 ఓవర్లు పేసర్లను వాడుకున్న ధోనీ.. ఆ తర్వాత స్పిన్నర్ మహేశ్ తీక్షణను రంగంలోకి దింపాడు. పవర్‌ప్లేలో చివరి ఓవర్ వేసిన తీక్షణ బౌలింగ్‌లో హార్దిక్ కట్ షాట్‌కు ప్రయత్నించాడు. అయితే ఆ బంతిని నేరుగా వెళ్లి జడేజా చేతుల్లో పడింది. నిజానికి ఆ బంతి వేయడానికి ముందు బ్యాక్‌వర్డ్ స్క్వేర్‌లో ఫీల్డింగ్ చేస్తున్న జడేజాను.. చాలా చాకచక్యంగా బ్యాక్‌వర్డ్ పాయింట్‌కు తీసుకువచ్చాడు ధోనీ. అయితే భారీ కట్ షాట్‌కు ప్రయత్నించిన హార్దిక్ .. జడేజాకు నేరుగా క్యాచ్ ఇచ్చేశాడు. హార్దిక్‌ను ట్రాప్ చేసిన ధోనీ ప్లాన్ వర్కౌట్ అయ్యింది. చెన్నై సూపర్ కింగ్స్ 15 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించి ఐపీఎల్ ఫైనల్లోకి వెళ్లింది. హార్దిక్ ఔటైన వీడియో ఇదే.

# లక్నోను ముంబై ఓడించగలదా.. రికార్డులు ఏం చెబుతున్నాయి..?



లక్నో సూపర్ జెయింట్స్-ముంబై ఇండియన్స్ జట్ల మధ్య చిదంబరం స్టేడియం (చెన్నై) వేదికగా ఇవాళ (మే 24) జరుగనున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఎవరికి గెలిచే అవకాశాలు ఉన్నాయి..?గత రికార్డులు ఏం చెబుతున్నాయి..? ఈ వివరాలను పరిశీలిస్తే.. ప్రస్తుత సీజన్‌లో లక్కు కొద్ది (గుజరాత్ ఆర్సీబీని ఓడగొట్టడంతో) ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన ముంబైతో పోలిస్తే.. సీఎస్‌కేతో సమానంగా సత్తా చాటి ప్లే ఆఫ్స్‌కు చేరిన లక్నోకే విజయావకాశాలు అధికంగా ఉన్నాయనేది జనాల అభిప్రాయం.రెగ్యులర్ కెప్టెన్ గైర్హాజరీలో సైతం అద్భుతంగా రాణిస్తున్న లక్నో.. కేవలం ఒక్కరిపై ఆధారపడకుండా సమష్టిగా విజయాలు సాధించింది. ఈ సీజన్‌లో లక్నో ట్రాక్ రికార్డు పరిశీలిస్తే.. వారు గెలిచిన 8 మ్యాచ్‌ల్లో బ్యాటర్లతో సమానంగా బౌలర్లు కూడా సత్తా చాటారు. అలాగే ఆ జట్టుకు కొన్ని మ్యాచ్‌ల్లో లక్ కూడా కలిసొచ్చింది. దీపక్ హుడా లాంటి అంచనాలు కలిగిన బ్యాటర్లు విఫలమైనా.. బ్యాటింగ్‌లో స్టోయినిస్, పూరన్, ప్రేరక్ మన్కడ్, కైల్ మేయర్స్.. బౌలింగ్‌లో బిష్ణోయ్, యశ్ ఠాకూర్, అమిత్ మిశ్రా, నవీన్ ఉల్ హక్ నిలకడగా సత్తా చాటారు. లక్నో పేస్ బౌలింగ్ విభాగం కాస్త బలహీనంగా కనిపిస్తున్నప్పటికీ, స్పిన్నర్లు ఆ లోటును భర్తీ చేస్తున్నారు.ముంబై విషయానికొస్తే.. రోహిత్ సేనలో నాణ్యమైన బౌలర్లు లేనప్పటికీ, వారు పటిష్టమైన బ్యాటింగ్ విభాగంతో మ్యాచ్‌లు గెలిచారు. వీరికి కూడా లక్ భారీగా కలిసొచ్చింది. సీజన్ ఆరంభంలో వరుస ఓటములు ఎదుర్కొన్న ముంబై అనూహ్యంగా పుంజుకుని ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. బౌలింగ్‌లో ఆకాశ్ మధ్వాల్, బెహ్రెన్‌డార్ఫ్, పియూష్ చావ్లా.. బ్యాటింగ్‌లో సూర్యకుమార్, గ్రీన్, ఇషాన్ కిషన్, నేహల్ వధేరా లాంటి వారు ముంబై విజయాల్లో ప్రధాన పాత్ర పోషించారు.సూర్యకుమార్ తన అత్యుత్తమ ఫామ్‌లో ఉండగా.. రోహిత్ శర్మ నిలకడలేమి, నాణ్యమైన ఫాస్ట్ బౌలింగ్ విభాగం లేకపోవడం ఆ జట్టుకు ప్రధాన లోటుగా చెప్పవచ్చు. అయినా వీరిదైన రోజున బ్యాటర్లు తెగిస్తే వీరిని ఆపడం? చాలా కష్టం. ఇక, గత రికార్డులను పరిశీలిస్తే.. ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు జరిగిన 3 మ్యాచ్‌ల్లో 3 సందర్భాల్లో గెలుపు లక్నోనే వరించింది.

# లక్నోతో కీలక పోరు.. ముంబై జట్టులోకి యువ స్పిన్నర్! విధ్వంసకర ఓపెనర్ కూడా



ఐపీఎల్-2023లో ఎలిమినేటర్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. బుధవారం చెన్నై వేదికగా జరగనున్న ఈ కీలక పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ తలపడనుంది.ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు మే 26న జరగనున్న క్వాలిఫియర్-2లో గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఒకే ఒక మార్పుతో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.. స్పిన్నర్ కుమార్ కార్తీకేయ స్థానంలో మరో యువ స్పిన్నర్ హృతిక్ షోకీన్ తుది జట్టులోకి వచ్చే ఛాన్స్ ఉంది.ఇంపాక్ట్ ప్లేయర్‌గా తిలక్ వర్మ వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ముంబై ఇండియన్స్ నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. ముఖ్యంగా ముంబై విధ్వంసకర బ్యాటింగ్ లైనప్ ముందు కృనాల్ పాండ్యా వ్యూహాలు ఎంతవరకు పనిచేస్తాయో వేచి చూడాలి. అయితే వంబై ఇండియన్స్ బౌలింగ్ విభాగం కాస్త వీక్‌గా ఉండడం లక్నోకు కలిసొచ్చే ఆంశం అనే చెప్పుకోవాలి.మరోవైపు లక్నో కూడా రెండు మార్పులతో బరిలోకి దిగనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గత రెండు మ్యాచ్‌ల్లో లక్నోకు ఓపెనింగ్ ప్రధాన సమస్యగా ఉంది. కాబట్టి ఈ? కీలకమైన మ్యాచ్‌కు విధ్వంసకర ఓపెనర్ కైల్ మైర్స్‌ను తిరిగి తీసుకు రావాలని లక్నో మెనెజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. మైర్స్ జట్టులోకి వస్తే.. పేసర్ నవీన్ ఉల్ హక్ బెంచ్‌కే పరిమితం కావల్సి వస్తుంది. అదే విధంగా కరణ్ శర్మ స్థానంలో పేసర్ యష్‌ఠాకూర్ తుది జట్టులోకి రానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.తుది జట్లు(అంచనా)లక్నో: క్వింటన్ డి కాక్, కైల్ మేయర్స్, ప్రేరక్ మన్కడ్, ఆయుష్ బదోని, మార్కస్ స్టోయినిస్, నికోలస్ పూరన్, కృనాల్ పాండ్యా, కృష్ణప్ప గౌతమ్, యశ్ ఠాకూర్, మొహ్సిన్ ఖాన్, రవి బిష్ణోయ్‌ముంబై ఇండియన్స్: రోహిత్ శర్మ(కెప్టెన్), కామెరాన్ గ్రీన్, సూర్యకుమార్ యాదవ్, టిమ్ డేవిడ్, నేహల్ వధేరా, క్రిస్ జోర్డాన్, పీయూష్ చావ్లా, జాసన్ బెహ్రెండోర్ఫ్, ఆకాష్ మధ్వల్, హృతిక్ షోకీన్

# వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ షెడ్యూల్.. వేర్వేరు గ్రూపుల్లో శ్రీలంక, వెస్టిండీస్

2023- దుబాయ్: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. ర్యాంకింగ్స్‌లో పడిపోయిన మాజీ చాంపియన్లు శ్రీలంక, వెస్టిండీస్ జట్లు ఈసారి క్వాలిఫయర్స్ ద్వారా ప్రధాన టోర్నీకి ముందడుగు వేయాల్సి ఉంటుంది.వచ్చేనెల 18 నుంచి జూలై 9 వరకు జింబాబ్వేలో క్వాలిఫయింగ్ టోర్నీ జరుగుతుంది. ప్రధాన టోర్నీకి కేవలం రెండు బెర్త్‌లే ఖాళీ ఉన్నాయి.మొత్తం 10 జట్లు అర్హత టోర్నీలో పాల్గొంటాయి. గ్రూప్ 'ఎ'లో వెస్టిండీస్, జింబాబ్వే, నెదర్లాండ్స్, నేపాల్, అమెరికా... గ్రూప్ 'బి'లో శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్, ఒమన్, యూఏఈ లీగ్ మ్యాచ్‌లు ఆడతాయి. ఫైనల్స్‌కు చేరే రెండు జట్లు అక్టోబర్-నవంబర్‌లలో భారత్ ఆతిథ్యమిచ్చే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. పారిస్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో అంకిత 7-5, 5-7, 6-2తోఎమిలైన్ డార్టరన్ (ఫ్రాన్స్)పై విజయం సాధించింది. 2 గంటల 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 51 సార్లు దూసుకొచ్చి 29 సార్లు పాయింట్లు సాధించింది.హారిక ఖాతాలో మరో 'డ్రా'మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మరో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. సైప్రస్‌లో 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య ఈ టోర్నీ జరుగుతోంది.




రష్యాకు చెందిన అంతర్జాతీయ మాస్టర్ పొలీనా షువలోవాతో మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను హారిక 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. రెండు గేముల్లో గెలిచి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హారిక ఏడో రౌండ్ తర్వాత 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

# సొంత జట్టు అభిమానులకు అదిరిపోయే కౌంటరిచ్చిన జడేజా

గత కొంత కాలంగా (ఐపీఎల్ 2022 నుంచి) తనను మానసిక వేదనకు గురి చేస్తున్న సొంత జట్టు అభిమానులకు సీఎస్‌కే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అదిరిపోయే కౌంటరిచ్చాడు.నిన్నటి క్వాలిఫయర్ 1 మ్యాచ్‌లో తనకు లభించిన అప్‌స్టాక్స్ మోస్ట్ వ్యాల్యువబుల్ అసెట్ (అత్యంత విలువైన ఆస్తి) అవార్డుకు సంబంధించిన ఫోటోను ట్విటర్‌లో షేర్ చేస్తూ.. తనను టార్గెట్ చేసిన అభిమానులకు ఫ్యూజులు ఎగిరిపోయే సమాధానం చెప్పాడు. అప్‌స్టాక్స్‌కు తెలిసింది కానీ.. కొంతమంది అభిమానులకు ఇంకా తెలియడం లేదని కామెంట్ జోడించి.. తన విలువ తెలియని అభిమానులకు చురకలంటించాడు.




ఈ ట్వీట్ ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది.కాగా, గత కొంత కాలంగా సీఎస్‌కే అభిమానులు.. సొంత జట్టు ఆటగాడు అని కూడా చూడకుండా రవీంద్ర జడేజాను మాటల తూటాలతో వేధిస్తున్నారు. జడ్డూ ఎంతగా రాణిస్తున్నప్పటికీ (ఈ ఒక్క సీజన్‌లోనే 3 మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు) వారు అతన్నే టార్గెట్ చేస్తూ బాధపెడుతున్నారు. తొందరగా ఔటై వెళ్లిపోవాలని.. తమకు ధోని ఆటను చూడాలని ఉందని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఘోరంగా అవమానిస్తున్నారు.




# ఎంజాయ్ చేయడం మానేసి.. ఈ రచ్చ ఎందుకంట?



ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ వార్ ఎక్కువ కనిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు తమిళ్ భాషలలో స్టార్ హీరోల అభిమానులు కాస్తా శృతి మించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకుంటూ విమర్శలు చేసుకుంటారు. ఒకప్పుడు అభిమానులు రోడ్ల మీదకొచ్చి కొట్టుకుంటే ఇప్పుడు సోషల్ మీడియా ఆ ప్రభావం కనిపిస్తోంది. తమ హీరో గొప్ప అంటే తమ హీరో గొప్ప అని చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మధ్య కొత్తగా రీ రిలీజ్ ట్రెండ్ మొదలైంది. స్టార్ హీరోల పుట్టినరోజు నాడు వారి పథ సినిమాలని ఫ్యాన్స్ షోలుగా ప్రదర్శించడం పోకిరితో స్టార్ట్ చేశారు. కేవలం సరదా కోసం ఈ ట్రెండ్ ని మొదలు పెట్టారు. అయితే తరువాత దీనిని అందరూ అలవాటుగా మార్చేసుకున్నారు. ఇక పోకిరి సినిమా ప్రదర్శించి ఊరుకుంటే సరిపోయేది కాని కలెక్షన్స్ ఎనౌన్స్ చేశారు. దీంతో మిగిలిన హీరోల అభిమానులు కూడా ఈ ట్రెండ్ ఫాలో అవుతూ తమ హీరో బెస్ట్ అని చూపించుకోవడం స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగా పవన్ కళ్యాణ్ జల్సా మూవీ రీరిలీజ్ చేసి పోకిరి కలెక్షన్స్ ని బ్రేక్ చేశారు. తరువాత ఖుషి మూవీ కూడా అత్యధిక సెంటర్స్ లో రిలీజ్ చేశారు. ఈ సినిమా రికార్డు స్థాయిలో కలెక్షన్స్ రాబట్టింది. ఇక దీనిని కొనసాగిస్తూ ప్రభాస్ వర్షం బిల్లా సినిమాలు రీరిలీజ్ చేసిన పెద్దగా వర్క్ అవుట్ కాలేదు. ఇక ఆరెంజ్ మూవీ ని నాగబాబు ఏకంగా రీరిలీజ్ చేయడంతో పాటు గట్టిగా ప్రమోషన్ కూడా చేశారు. దీంతో ఈ మూవీ మూడు కోట్లకి పైగా గ్రాస్ ని రాబట్టింది. ఏకంగా మూడు రోజుల పాటు ఈ మూవీని థియేటర్స్ లో ప్రదర్శించడం విశేషం. ఇదిలా ఉంటే తాజాగా తారక్ బర్త్ డే సందర్భంగా సింహాద్రి మూవీని భారీఎత్తున రీరిలీజ్ చేశారు. హైలైట్ ఏంటంటే దీనికి ప్రీరిలీజ్ ఈవెంట్ కూడా నిరహించారు. అలాగే సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రమోట్ చేశారు. ఇక ఈ సినిమాతో ఖుషి కలెక్షన్స్ బ్రేక్ చేసాం అంటూ ట్విట్టర్ లో పోస్టులు పెట్టి వైరల్ చేశారు. రికార్డు స్థాయిలో కలెక్షన్స్ వచ్చాయని ప్రచారం చేశారు. అయితే ఓవరాల్ గా చూసుకుంటే 4 కోట్లు గ్రాస్ దాటినా ఖుషిని బ్రేక్ చేయలేదు. అయితే ఈ సినిమా కలెక్షన్స్ విషయంలో ఇప్పుడు పవర్ స్టార్ అభిమానులు తారక్ అభిమానులని ట్రోల్ చేస్తున్నారు. ఫేక్ కలెక్షన్స్ అంటూ ప్రచారం చేస్తున్నారు. దీంతో ఒకరిపై ఒకరు దూషణలకి దిగుతూ ఉండటం చర్చనీయాంశంగా మారింది. హ్యాపీగా అభిమాన హీరో సినిమాని ఎంజాయ్ చేయకుండా కలెక్షన్స్ రికార్డ్స్ కోసం పరుగులు పెడితే అసలుకె ఇబ్బంది అవుతుందనే మాట వినిపిస్తోంది.



# బాలయ్య మల్టీస్టారర్కు డైరెక్టర్ అతడే?



రెండు మూడు రోజులుగా సౌతిండియాలోని అన్ని ఫిల్మ్ ఇండస్ట్రీల్లో విపరీతంగా హాట్ టాపిక్ అవుతోన్న అంశాల్లో నటసింహా నందమూరి బాలకృష్ణ చేయబోతున్న మల్టీస్టారర్ మూవీ న్యూస్ ఒకటి. ఈ బడా హీరో ఇప్పుడు ఏకంగా కన్నడ స్టార్ హీరో శివరాజ్కుమార్ సూపర్ స్టార్ రజినీకాంత్తో కలిసి రెండు భాగాలుగా తెరకెక్కే భారీ ప్రాజెక్టును చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. శివరాజ్కుమార్ సొంత బ్యానర్లో ఈ సినిమా రూపొందబోతుందని కూడా న్యూస్ లీకైంది. అంతేకాదు ఇది రెండు భాగాలుగా రాబోతుందని అంటున్నారు. అందులో మొదటి దానిలో బాలయ్యతో పాటు శివరాజ్కుమార్ కనిపిస్తారట. అలాగే రెండో పార్టులో నటసింహంతో సూపర్ స్టార్ రజినీకాంత్ నటించనున్నారని తెలిసింది. దీంతో ఈ క్రేజీ ప్రాజెక్టు సంచలనంగా మారిపోయింది. దక్షిణ భారతదేశంలోనే పేరున్న ముగ్గురు బడా హీరోలు కలిసి నటించబోతున్న మల్టీస్టారర్ ప్రాజెక్టు గురించి మరిన్ని వార్తలు వైరల్ అవుతోన్నాయి. ముఖ్యంగా దీన్ని తెరకెక్కించే డైరెక్టర్ గురించి అంతా వెతకడం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా దీనిపై క్లారిటీ వచ్చింది. ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్టును కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన హర్ష రూపొందించబోతున్నాడట. కొరియోగ్రాఫర్గా కెరీర్ను మొదలు పెట్టి ఆ తర్వాత దర్శకుడిగా మారిన హర్ష.. కన్నడంలో చాలా హిట్ చిత్రాలను తెరకెక్కించాడు. ఈ క్రమంలోనే ఇటీవలి కాలంలో వరుస శివరాజ్కుమార్ హీరోగా 'భజరంగీ 2' 'వేద' వంటి భారీ బడ్జెట్ చిత్రాలను చేశాడు. ఆ సమయంలోనే ఈ మల్టీస్టారర్ కథను చెప్పడం.. ఆ తర్వాత రజినీకాంత్ బాలయ్యను ఒప్పించడం చకచకా జరిగాయట. ఇక ఈ చిత్రంలో మొదటి భాగంలో శివరాజ్కుమార్ పాత్ర హైలైట్ కాబోతుందట. క్లైమాక్స్కు ముందు బాలయ్య ఎంట్రీ ఇస్తారని తెలిసింది. ఇక రెండో పార్టులో వీళ్లిద్దరూ ప్రధాన పాత్రల్లో కనిపిస్తారని అంటున్నారు. ఇందులో సెకెండాఫ్లో రజినీకాంత్ పాత్ర ఎంట్రీ ఉంటుందట. వీళ్లందరి స్క్రీన్ ప్రజెన్స్ను ఓ రేంజ్లో ఎలివేట్ చేసి చూపించబోతున్నాడనే టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. రజినీకాంత్ ఈ సినిమాకు డేట్స్ కేటాయించలేని పరిస్థితి ఉంటే.. కమల్ హాసన్ మమ్ముట్టి లేదా మోహన్ లాల్ను దీని కోసం తీసుకునే ఛాన్స్ ఉందని సమాచారం.

# డింపుల్ ట్వీట్ తో పోలీస్ అధికారితో వార్ రచ్చకెక్కినట్లేనా!



ఐపీఎస్ అధికారితో నటి డింపుల్ హయతి వార్ రచ్చకెక్కినట్లేనా? ఒక్క ట్వీట్ తో పాత గాయాలు రేగుతు న్నాయా? ఇద్దరి మధ్య వార్ ముదురుతోందా? అంటే అవుననే చెబుతుంది తాజా సన్నివేశం. ఇప్పటికే డింపుల్ పై సెక్షన్ 341..279..353 కింద కేసులు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అన్యాయంగా తన కారుని ఢీ కొట్టడమే కాకుండా...దురుసుగా ప్రవర్తించిందని ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే కారు డ్రైవర్ చేతన్ కుమార్ జూబ్లీ హిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విచారణ కోసం పోలీస్ స్టేషన్ కి రావాలంటూ డింపుల్ కి సమన్లు వెళ్లాయి. తాజాగా ఈ ఘటనపై ఐపీఎస్ అధికారి స్పందించారు. 'ఆమె చాలా దురుసుగా ప్రవర్తిస్తుంటుంది. పలుమార్లు నచ్చ చెప్పినా పద్ధతి మార్చుకోలేదు' అన్నారు. ఆ వ్యాఖ్యల్ని ఉద్దేశించి డింపుల్ ఆసక్తికర ట్వీట్ చేసింది. 'అధికారాన్ని ఉపయోగించి ఏ తప్పును ఆపలేరు' అని ట్వీట్ చేసింది. దాంతో పాటు నవ్వుతున్న ఓ ఎమోజీని పోస్ట్ చేసింది. దీంతో సన్నివేశం మరింత రసవత్తరంగా మారుతున్నట్లు కనిపిస్తుంది. ఇది ఇప్పటి వివాదం కాదు. చాలా కాలంగా ఇద్దరి మధ్య కారు పార్కింగ్ వ్యవహారంలో వివాదం నడుస్తున్నట్లు కనిపిస్తుంది. ఇప్పటివరకూ కామ్ గా ఉన్న వివాదం మీడియాకి ఎక్కడంతో! ఇరువైపుల నుంచి రకరకాల వెర్షన్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా డింపుల్ హైలైట్ అవుతుంది. కారుని కారుతో తన్నడం... ఆమె దురుసు ప్రవర్తన..దూకుడు హైలైట్ అవుతుంది. అలాగే డింపుల్ ట్వీట్ వెనుక బలమైన కారణాలు ఉండొచ్చని తెలుస్తుంది. పోలీస్ అధికారి కారును ఢీ కొట్టడంతో వివాదం వచ్చిందా? లేక పార్కింగ్ విషయంలో గొడవొచ్చిందా? అన్న కొత్త వాదనలు వినిపిస్తున్నాయి. పోలీస్ అధికారి కారు పార్కింగ్ లోనే డింపుల్ అనుమతి లేకుండా పార్కింగ్ చేసినట్లు..అసలు వివాదానికి కారణం ఇదేనంటూ ప్రచారం సాగుతోంది.


# శ్రీలీల.. ఏ హీరోతో అయినా ఇది పక్కా!



పెళ్లి సందడి సినిమాతో రెండేళ్ల క్రితం సినీ రంగంలో అడుగు పెట్టిన శ్రీలీల అందరికీ మోస్ట్ ఫేవరెట్ యాక్టర్ గా నిలిచిపోయింది. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఆ చిత్రంతోనే అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేసింది. తన అందం అభినయంతో కుర్రకారు గుండెల్లో తిష్ట వేసుకొని కూర్చుంది. కేవలం నటన పరంగా మాత్రమే కాకుండా డ్యాన్స్ కూడా ఇరగదీస్తూ.. అద్భుత మైన అవకాశాలను అంది పుచ్చుకుంటోంది. ముఖ్యంగా కుర్రకారు హాట్ ఫేవరెట్ అయిన ఈ క్యూట్ బ్యూటీ ప్రస్తుతం అరడజను సినిమాల్లో నటిస్తోంది. స్టార్ హీరోల సరసన కనిపించి అందరినీ మెస్మరైజ్ చేసేందుకు సిద్ధం అవుతోంది. మహేష్ బాబు పవన్ కల్యాణ్ విజయ్ దేవరకొండ బాలకృష్ణ వంటి టాప్ లీగ్ హీరోలతో కలిసి పని చేస్తోంది. అయితే ఈమెను సినిమాలోకి తీసుకున్నారంటే నటన కు అందానికి మాత్రమే ప్రాధాన్యతను ఇవ్వకుండా.. డ్యాన్స్ కూడా ఉండేలా చూసుకుంటున్నారు. అది కూడా ఒకటి రెండూ కాదు ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారట. సూపర్ స్టార్ మహేష్ బాబు త్రివిక్రమ్ ల కాంబోలో వస్తున్న ఎస్ఎస్ఎంబీ 28కి శ్రీ లీల ఇప్పటికే సంతకం చేసిందని అందరికీ తెలిసిన విషయమే. అలాగే అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్బీకే108లో నందమూరి బాలకృష్ణ సినిమాలో మెరవబోతోంది. బాలయ్య బాబు స్నేహితుడి కూతురుగా శ్రీలీల కనిపించబోతోంది. ఇటీవలే శ్రీలీల ఉస్తాద్ భగత్ సింగ్ సెట్స్లోకి ప్రవేశించింది. ఇందులో ఆమె పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన కనిపిస్తుంది. ఈ ప్రాజెక్టతో పాటు విజయ్ దేవరకొండ నితిన్ రామ్ పోతినేని పంజా వైష్ణవ్ తేజ్లతో కూడా ఆమె ఒక సినిమా లైన్ లో పెట్టుకుంది. ఒక్క టాలీవుడ్లో ఇలా ఏడెనిమిది ప్రాజెక్టుల ను లైన్ లో పెట్టుకుంది అంటేనే ఈమె స్థాయి ఏంటో అర్థం అయిపోతుంది. కేవలం నటన అందామే కాకుండా శ్రీలీల డ్యాన్స్ కూడా ఇరగదీస్తుంది. ఆమె డ్యాన్స్ కూడా సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు. ముఖ్యంగా పెళ్లి సందడి ధమాకా చిత్రంలో ఆమె నృత్యాన్ని చూసిన దర్శకులందరూ తమ సినిమాల్లోనూ ఈమెతో స్టెప్పులో వేయించుకోవాలని భావిస్తున్నారు. శ్రీలీల సినిమాలో ఉందంటే అభిమానులు ఏ రేంజ్ లో ఎగ్జైట్ అవుతున్నారో గుర్తించి మరీ.. ఫ్యాన్స్ ను నిరాశ పరచకుండా ఉండేందుకు కనీసం రెండు మూడు పాటల్లో శ్రీలీలతో అదిరిపోయే స్టెప్పులు వేయించేందుకు సిద్ధం అవుతున్నారట. చూడాలి మరి రాబోయే సినిమాల్లో ఎలాంటి మాస్ సాంగ్స్ తో శ్రీలీల అభిమానుల్ని మెస్మరైజ్ చేస్తుందో.

# రవితేజ సినిమా కోసం ఎక్సైట్ అవుతున్న బాలీవుడ్ హీరో..!

ప్రస్తుతం ఇండియన్ సినిమాని బాహుబలికి ముందు బాహుబలికి తర్వాత అని చెప్పొచ్చు. ఎందుకంటే బాహుబలికి ముందు ఏ ఇండస్ట్రీకి ఆ ఇండస్ట్రీ పనిచేసేది. ఎవరో కొందరు నటులు మాత్రమే అన్ని భాషల్లో నటించేవారు. కానీ ఎప్పుడైతే బాహుబలి ఆర్ఆర్ఆర్ వచ్చాయో టాలీవుడ్ బాలీవుడ్ కోలీవుడ్ లా కాకుండా ఇండియన్ సినిమాగా పనిచేయడానికి ఇష్టపడుతున్నారు. తెలుగు సినిమాల్లో బాలీవుడ్ నటులు నటిస్తున్నారు. బాలీవుడ్ లోనూ మన తెలుగు హీరోలు సత్తా చాటడానికి రెడీ అవుతున్నారు. ఈ క్రమంలోనే మాస్ మహారాజ్ రవితేజ సినిమా కోసం కూడా కొందరు హీరోలు కదిలివచ్చారు. ముఖ్యంగా ఈ మూవీ కోసం బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం చాలా ఎక్సైట్ అవుతున్నాడు. ఇంతకీ మ్యాటరేంటంటే రవితేజ కొత్త సినిమా టైగర్ నాగేశ్వరరావు. ఈ మూవీ టీజర్ ని మే 24వ తేదీన రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాని పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సనిమా టీజర్ కి తమిళంలో కార్తీ కన్నడలో శివరాజ్కుమార్ మలయాళంలో దుల్కర్ సల్మాన్ వాయిస్ ఓవర్ ఇవ్వగాబాలీవుడ్ లో జాన్ అబ్రహం వాయిస్ ఓవర్ ఇచ్చాడు. ఇదే విషయాన్ని జాన్ అబ్రహం సోషల్ మీడియా వేదికగా తెలియజేశాడు. ఈ మూవీ ఫస్ట్ లుక్ వీడియోని తన సోషల్ మీడియా ఎకౌంట్ లో షేర్ చేశారు. దీనికి వాయిస్ ఓవర్ ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. ఈ మూవీ కోసం తాను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ఆయన చెప్పడం విశేషం. జాన్ అబ్రహం టీజర్ కి వాయిస్ ఓవర్ ఇచ్చారు అనగానే అది ఎంత ఆసక్తిగా ఉంటుందా అని ఆయన అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి చూడాలి ఈటీజర్ ఎంత వరకు ఆకట్టుకుంటుందో. ఈ సినిమాకి వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్తో వస్తున్న ఈ సినిమాలో హేమలత లవణం అనే ముఖ్యమైన పాత్రలో రేణు దేశాయ్ కనిపించబోతోంది. ఆమె క్యారెక్టర్కు సంబంధించిన గ్లింప్స్ను ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేశారు. రవితేజ సరసన నుపుర్ సనన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉండగా రవితేజ కు ఇటవల వరస ప్లాపులు చుట్టుముడుతున్నాయి. ధమాకా కాస్త పర్లేదు అనిపించినా ఆ తర్వాత వచ్చిన రావణాసుర మాత్రం




బోల్తా కొట్టింది. ఈ మూవీలో ఆయన నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించారు. కానీ మూవీ కొంచెం కూడా ఆకట్టుకోలేకపోయింది. ఓటీటీలో సైతం పెద్దగా ఎవరూ ఈ మూవీ చూడటానికి ఆసక్తి చూపించకపోవడం గమనార్హం. మరి ఈ సినిమబాతో అయినా రవితేజ ఆకట్టుకుంటాడో లేదో చూడాలి.

విభారె

గురువారం 25-05-2023

## ఉమ్మడి కర్నూల్ జిల్లాలో . సవాల్ ప్రతి సవాళ్ల తో ముగిసిన లోకేష్ పాద యాత్ర .




నంద్యాల మా ప్రతినిధి మే 24 విభారె న్యూస్ :-. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40రోజులపాటు 507 కిలోమీటర్ల ప్రయాణంలో 14 నియోజకవర్గాల మీదుగా సాగింది. .. ఉమ్మడి కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్ర విజయవంతం అయిందని తెలుగు దేశం పార్టీ నాయకులు భావిస్తున్నారు . ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ లో నారా లోకేష్ ఎమ్మెల్యే ల అవినీతి పై విరుచుకుపడ్డారు. ప్రతి ఎమ్మెల్యే కు ఓ నామకరణం చేశారు. వెను వెంటనే వైసీపీ ఎమ్మెల్యేలు ప్రెస్ మీట్ పెట్టి మరీ లోకేష్ ను తెలుగు దేశం పార్టీ ఇంచార్జీలను ఉతికి ఆరేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పాదయాత్ర మంగళవారం సాయంత్రం తో ముగిసింది.

## వాసవి అన్నపూర్ణ సేవా పథకానికి విరాళం అందజేసిన ఆవోపా ఉపాధ్యక్షుడు.



ఎమ్మిగనూరు మే 24 విభారె న్యూస్.ఆవోపా ఉపాధ్యక్షుడు పిన్ని సుబ్రహ్మణ్యం కూతురు లక్ష్మీ సుప్రజ వివాహ సందర్భంగా ఆవోపా సభ్యులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ శుభ సందర్భంలో పిన్ని సుబ్రహ్మణ్యం, కల్పన దంపతులు నిరుపేద మహిళలకు నిత్యావసరాలు అందించే వాసవి అన్నపూర్ణ సేవా పథకానికి రు.7,200 లు విరాళం ప్రకటించారు. వీరికి వీరి కుటుంబానికి వాసవి మాత ఆశీర్వాదాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ఎల్లవేళలా ఉండాలని వారు కోరారు.

## జై శ్రీరామ్ నామస్మరణతో ధ్వజ ఉపరి పీఠ కలశ ప్రతిష్టాపన జరిగినది.



ఎమ్మిగనూరు మే 24 విభారె న్యూస్.శ్రీ కోట ఆంజనేయ స్వామి దేవాలయం లో గత మూడు రోజులుగా జరిగిన పూజా కార్యక్రమంలో మూడవ రోజు జేష్ట శుద్ధ పంచమి బుధవారం రోజు ఉదయం గం.11.20 నుండి గం.12.00 వరకు అభిజిత్ లగ్నమునందు ధ్వజ ఉపరిపీఠ కలశ ప్రతిష్టాపనము, కూష్మాండ బలి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసనము, కుంభాభిషేక కలశమార్జన, సంప్రోక్షణము, కంకణ విసర్జనము, వేద ఆశీర్వచనము జరిగినది. పై పూజా కార్యక్రమాలన్నియూ జైశ్రీరామ్ ముక్తకంఠ నామస్మరణ తో భక్తి పారవశ్యంతో జరిగినవి. అనంతరం బ్రాహ్మణ, బుధ జన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గత మూడు రోజుల నుండి జరిగిన పూజ కార్యక్రమాలు అన్నియు ఆలయ అర్చకులు బి. విజయ భాస్కర శాస్త్రి ఆధ్వర్యంలో, బి. లక్ష్మీనరసింహ శాస్త్రి, బి. విష్ణువర్ధన శాస్త్రి, బి.వి. రంగశాస్త్రి,బి. నటరాజ శాస్త్రి, శ్రీధర స్వామి ల వేద బ్రాహ్మణ జపత్వమున నిర్విరామంగా పూజా కార్యక్రమాలు జరిగినవి.



# మహానంది అడవులలో గుట్టుచప్పుడు కాకుండా కలప అక్రమ రవాణా

## అధికారులు మరియు ప్రొటెక్షన్ వాచర్ల కనుసైగల్లోనే ఇదంతా జరుగుతున్నట్టు గుసగుసలు..



నంద్యాల మా ప్రతినిధి మే 24 విభారె న్యూస్ :–అడవులతోనే మానవ మనుగడ. అలాంటి అడవి అక్రమార్కుల గొడ్డలి వేటుకు బలవుతోంది. ఇష్టారీతిన చెట్లను నరికివేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కలపను అక్రమంగా తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. దీంతో చెట్లు లేక అడవి వెలవెలబోతోంది. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అటవీ శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నంద్యాల జిల్లా మహానంది మండలం, మహానంది - గాజులపల్లి వెళ్లే రహదారి తెలుగంగ కాలువ సమిపాన (జన శంకర తపోవనం) గాంధీ విగ్రహం ముందు బాగాన సుమారు ఒకటిన్నర కిలోమీటర్ లోపల అడవిలో చెట్లను విచ్చలవిడిగా నరికివేశారు. అడవి లోపలికి వెళ్తే అన్ని నరికేసిన చెట్ల మొదళ్లే దర్శనమిస్తున్నాయి. గత రెండు రోజుల క్రితం రాత్రివేళల్లో రెండు ట్రాక్టర్లు కలప తరలించినట్టుగా సమాచారం ఇంకా 30 నంచి 40 దుంగలు ఉన్నట్టు తెలుస్తుంది, అదేవిధంగా ప్రతిరోజు ఎద్దుల బండి అడవిలోకి వెళ్లి ఒక రోజంతా ఉండి విలువైన కలపను తరలిస్తున్నారని సమాచారం. ఈ విషయంపై పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ, అటవీ అధికారులకు ఎంతో కొంత ఇస్తే ఏ చెట్టునైనా నరుక్కుపొమ్మంటారని కొందరు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా అటవీ శాఖ అధికారుల ప్రమేయం లేకుండా అడవి లోపలికి వెళ్లి చెట్లను నరకటం ఎవరికి సాధ్యం కాదు. అటవీ అధికారులు వెంటనే స్పందించి కలప అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

## జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి - ఏపీడబ్ల్యు జేఎఫ్




నంద్యాల మా ప్రతినిధి మే 24 విభారె న్యూస్ :- జర్నలిస్టు పై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నంద్యాల ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షుడు కాకర్ల శివ ప్రధాన కార్యదర్శి జగన్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ హైదరాబాదులో ఎంపీ అవినాష్ రెడ్డి కి సంబంధించి సిబిఐ విచారణ న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి హెచ్ఎంటీవీల జర్నలిస్టులపై దాడి చేసి గాయపరచడం అప్రజా స్వామికమని పేర్కొన్నారు .అదేవిధంగా ఆదివారం కర్నూలు ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు ఆంధ్రజ్యోతి ఈనాడు విలేకరులపై దాడి చేయడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు .జర్నలిస్టులపై దాడులు చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జాషువా, కమిటీ మెంబర్లు బాబు, రాజు ,భాష, హరీష్, మధు పలువురు పాల్గొన్నారు.

## నంద్యాల సబ్ డివిజన్ కు సంబందించి నేర సమీక్షా సమావేశం......

### నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి.



నంద్యాల మా ప్రతినిధి మే 24 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ రఘువీర్ రెడ్డి నంద్యాల జిల్లాలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో నంద్యాల సబ్ డివిజన్ కు సంబందించి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణ కొరకు తీసుకోవలసిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో నిర్వహించవలసిన అంశాలు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన బాలురు/బాలికలు యొక్క విషయాలలో త్వరితగతిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి యొక్క ఆచూకీ తెలుసుకొని వారి యొక్క తల్లిదండ్రులకు అప్పగించాలని, బాధితులతో మాట్లాడేటప్పుడు మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, మాదకద్రవ్యాల నిర్మూలన కొరకు ప్రతి ఒక్క అధికారి బాధ్యతతో ఉద్యోగ నిర్వహణ చేయాలని, రహదారి ప్రమాదాల నివారణ కొరకు ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 28 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు సదరు బ్లాక్ స్పాట్లు వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని,హెచ్చరిక బోర్డ్ లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ,అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వీటికి అధికారులకు ప్రాధాన్యత ఇవ్వాలని దిశ నిర్దేశం చేశారు.?గ్రేవ్ కేసుల్లో తప్పనిసరిగా ముద్దాయి లకు శిక్షలు పడేలా చర్యలుండాలి కేసులు వీగిపోకూడదు.?నిందితులకు శిక్ష... బాధితులకు న్యాయం జరగాలంటే, నేరం జరిగాక ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాలు సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులకు దిశానిర్ధేశం చేశారు.?గ్రామ ప్రాంతాలలో చిన్న సమస్యలు సైతం తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలి అని,?వేసవి కాలం లో ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి. విజిబుల్ పోలీసింగ్ పెంచాలి. బీట్స్ రీ ఆర్గనైజ్ చేయాలి.?జిల్లాలో క్రికెట్ బెట్టింగులకు తావుండకూడదు. కింది స్థాయి క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల వరకు ఎవర్నీ వదలొద్దు?రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెంచండి. రౌడీ షీటర్ లు సత్ప్రవర్తనతో మెలగాలని అవగహన కార్యక్రమము నిర్వహించాలి అని. ?జిల్లా ప్రశాంతత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం హోదాలు మరచి అందరం కలిసి సమిష్టిగా పని చేద్దాం. విధులు సమర్ధవంతంగా నిర్వర్తిద్దాం.? పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా, మర్యాదగా వ్యవహరించాలి.పోలీసు స్టేషన్ కు వచ్చే ప్రజల సమస్యలను పక్కాగా వినాలి. చట్ట పరిధిలో న్యాయం చేయాలి.?సామాన్య ప్రజల సమస్యలు/ బాధలను సులువుగా తీసుకోవద్దు. ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకోండి? స్పందన పిటీషన్ లపై ప్రాపర్ గా నిర్ధేశిత గడువులోగా చర్యలు తీసుకోవాలి.చర్యలు తీసుకున్నవి జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.?అవినీతి కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. పోలీసు ప్రతిష్ట దిగజార్చే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.?జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిరోధించాలని, నాటు సారాయి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నిషేధించిన ఖైని, గుట్కా అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.? అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరించాలి పూర్తిస్థాయిలో విచారణ దర్యాప్తు చేసి ఖచ్చితమైన ఆధారాలతో కోర్టుకు సమర్పించి బాధితులకు సరైన న్యాయం చేయాలన్నారు.. ఈ కార్యాక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్. .రమణ ,నంద్యాల టౌన్ డియస్పీ సి.మహేశ్వర్ రెడ్డి మరియు సబ్ డివిజన్ సీఐ. ఎస్సై లు , జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో లు పాల్గొన్నారు.

## సిద్దేశ్వరం అలుగు- రాయలసీమకు వెలుగు



నంద్యాల మా ప్రతినిధి మే 24 విభారె న్యూస్ :–దశాబ్దాలుగా రాయలసీమ ప్రాంతం సాగునీటి విషయంలో వివక్షతను ఎదుర్కొంటోందని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి విమర్శించారు.మే 31 న జరుగనున్న సిద్దేశ్వర జలజాగరణ దీక్షను పురస్కరించుకొని బుధవారం నంద్యాల మండలంలోని అయ్యలూరు, చాబోలు, మిట్నాల, పాండురంగాపురం, చాపిరేవుల గ్రామాలలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని చేపడితే రాయలసీమలో కరువును నిర్మూలించవచ్చని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలు సహకరించకపోయినా వేలాది మంది రైతులే స్వచ్ఛందంగా తరలివచ్చి మే 31, 2016 న సిద్దేశ్వర అలుగు శంఖుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారని ఆయన గుర్తు చేసారు.అతి తక్కువ ఖర్చుతో నిర్మాణం అయ్యే ఈ అలుగు పట్ల సీమ రాజకీయ నాయకులు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి- నంద్యాల జాతీయ రహదారిలో భాగంగా కృష్ణా నదిపై కేంద్ర ప్రభుత్వం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతోందని, ఐకానిక్ బ్రిడ్జి బదులు అలుగుతో కూడిన బ్రిడ్జిని నిర్మిస్తే రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆయన పేర్కొన్నారు. సిద్దేశ్వర అలుగు శంఖుస్థాపన ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31 న జరిగే సిద్దేశ్వర జలజాగరణ దీక్షను విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సిద్దేశ్వర జలజాగరణ దీక్ష గోడపత్రికలను ప్రజలతో కలిసి విడుదల చేశారు.ఈ కార్యక్రమాలలో భాస్కర్ రెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, గ్రామ పెద్దలు అప్పిరెడ్డి, చిన్న తిరుపతి రెడ్డి, త్రిలేంగశ్వరరెడ్డి, తులశీశ్వరరెడ్డి మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యా దీవెన నంద్యాల జిల్లా యందు 28,486 మంది విద్యార్థులకు సంబంధించి 25,576 మంది తల్లుల ఖాతాల్లో రు. 23,91,35,775/-లు జమ

### -----జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్




నంద్యాల మా ప్రతినిధి మే 24 విభారె న్యూస్ :–జగనన్న విద్యా దీవెన జనవరి - మార్చి 2023 త్రైమాసికానికి సంబందించి 28,486 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 23.91 కోట్లు జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు.బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు బహిరంగ వేదిక నుంచి జగనన్న విద్యా దీవెన పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 9.95 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో 703 కోట్ల రూపాయలను కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జమ చేసే వర్చువల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, సంక్షేమ శాఖ డిడి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు తదితరులు వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద జనవరి - మార్చి 2023 త్రైమాసికానికి 28,486 మంది విద్యార్థులకు సంబంధించి 25,576 మంది తల్లుల ఖాతాల్లో రూ. 23.91 కోట్లు జమ చేశామన్నారు.జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 4,718 మంది విద్యార్థుల తల్లులకు రు.3,97,40,552/-లు, బనగానపల్లిలో 5,268 మందికి రు.4,37,53,823/-లు, డోన్ లో 4,418 మందికి రు.3,57,37,041/-లు, నందికొట్కూర్ లో 3,901 మందికి రూ.3,10,66,087/-లు, నంద్యాలలో 4,956 మందికి రు.4,65,86,224/-లు, పాణ్యంలో 1453 మందికి రూ. 1,19,68,962/-లు, శ్రీశైలంలో 3,772 మందికి రు.3,02,83,086/- లు వెరసి మొత్తం 28,486 మంది విద్యార్థులకు సంబంధించి 25,576 మంది తల్లుల ఖాతాల్లో రు. 23,91,35,775/-లు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు.. అనంతరం జిల్లా కలెక్టర్, మార్క్ ఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు.

## వివాహానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు.

ఎమ్మిగనూరు మే 24 విభారె న్యూస్.స్థానిక వాసవి కళ్యాణ మండపం లో బుధవారం జరిగిన వెంకట సాయి మణిదీప్, లక్ష్మీ సుప్రజ లు దంపతులుగా ఒకటైన శుభ సందర్భంలో బుధవారం ఆర్యవైశ్య సంఘ సభ్యులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆశీర్వాద పంచరత్న పత్రాల పటములను అందజేశారు. ఈ శుభ సందర్భంలో వధువు తల్లిదండ్రులు పిన్ని సుబ్రమణ్యం దంపతులు ఆర్యవైశ్య సంఘానికి రు.5,116 లు, వీరి వియ్యంకులు మారం వెంకటేశ్వర్లు రు.20,116 లు విరాళం అందించారు. వాసవి మాత కృప కటాక్షలతో,ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలను వీరికి ప్రసాదించాలని వాసవి మాతను మనసారా కోరుకుంటున్నామని ఆర్యవైశ్య సంఘ సభ్యులు తెలిపారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**